నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 2-9-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:26 పేజీలు: 4 వెల: రూ.1/-

ముగిసిన ప్రణబ్ అంత్యక్రియలు

.ప్రణబ్ అధికారిక నివాసంలో చిత్రపటం వద్ద నివాళి అర్పించిన ప్రధాని మోడీ

కోవిడ్ నిబంధనల మేరకు పూర్తి
సైనిక లాంఛనాలతో నిర్వహణ
నివాళి అర్పించిన, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని





న్యూఢిల్లీ,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అంత్యక్రియలు ఢిల్లీలోని లోధి శ్మశానవాటికలో ముగిశాయి. అశ్రునయనాల మధ్య దాదాకు కన్నీటి వీడ్కోలు పలికారు. సైనిక లాంఛనాలతో ప్రణబ్ అంతిమ సంస్కారాలను నిర్వహించారు. కొవిడ్ నిబంధనల ప్రకారం ప్రణబ్ అంత్యక్రియలు పూర్తి చేశారు. ప్రణబ్ అంత్యక్రియలను ఆయన కుమారుడు అభిజిత్ ముఖర్జీ నిర్వహించారు. కొవిడ్ నేపథ్యంలో గన్ క్యారేజ్ పై కాకుండా సాధారణ అంబులెన్స్‌లో ప్రణబ్ అంతిమయాత్ర కొనసాగింది. అనారోగ్య సమస్యలతో ఆగస్టు 10న ఢిల్లీలోని ఆర్మీ ఆస్పత్రిలో ప్రణబ్ చేరిన విషయం విదితమే. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో ఆయనకు ఆర్మీ ఆస్పత్రి వైద్యులు సర్జరీ చేశారు. ఆ తర్వాత ప్రణబ్‌కు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ఈ క్రమంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 31న సాయంత్రం ప్రణబ్ తుదిశ్వాస విడిచారు. సైనిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు జరిగాయి. ప్రణబ్‌కు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు నివాళులర్పించారు. మెదడు సంబంధిత సమస్యతో బాధపడుతున్న ప్రణబ్‌కు.. కరోనా వైరస్ కూడా సోకడంతో ఢిల్లీలోని ఆర్మీ రిసెర్చ్ అండ్ రిఫరల్ ఆస్పత్రిలో చికిత్సనందించారు. కరోనా కారణంగా ఆయన ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయి. తర్వాత ఆయన మూత్రపిండాల పనితీరు మందగించింది. క్రమంగా రక్తం విషపూరితమై (సెప్సిస్), ఆదివారం నాడు సెప్టిక్ షాక్‌తో బాధపడ్డారని.. సోమవారం కార్డియాక్ అరెస్టుతో మరణించారని వైద్యులు తెలిపారు. ఇదిలావుంటే అంతకుముందు మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు. 10 రాజాజీమార్గ్‌లోని ప్రణబ్ అధికారిక నివాసంలో ఆయన చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారులు, కూతురును పరామర్శించారు. అంతకు ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాలు ప్రణబ్ చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. అలాగే ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌తో పాటు త్రివిధ దళాల సీడీఎస్ బిపిన్ రావత్, త్రివిధ దళాల అధిపతులతో పాటు పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. అంతకు ముందు ఉదయం 9గంటలకు ప్రణబ్ పార్థివ దేహాన్ని సైనిక హాస్పిటల్ నుంచి 10 రాజాజీమార్గ్‌లోని అధికారిక నివాసానికి తీసుకువచ్చారు. ప్రణబ్‌కు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనుండగా.. అధికారులు కొవిడ్ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు.

కొత్త రెవెన్యూ చట్టానికి తుది మెరుగులు

అధికారులతో సమీక్షిస్తున్న సిఎం కెసిఆర్
ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టే ఆలోచన

హైదరాబాద్,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): కొత్త రెవెన్యూ చట్టానికి ప్రభుత్వం తుది మెరుగులు దిద్దుతోంది. ఇటీవలి ఘటనలు, గతంలో సిఎం కెసిఆర్ ప్రకటించిన మేరకు 22 చట్టాలతో కొత్త రెవెన్యూ కోడ్ సిద్ధం అవుతోంది. అనేక అంశాలపై గతకొంత కాలంగా కసరత్తు చేసిన కెసిఆర్ దానికి తుదిరూపు ఇస్తున్నారు. పాత చట్టాల్లోని అవసరమైన వాటికే కొత్త రెవెన్యూ చట్టంలో చోటు కల్పిస్తున్నారు. కొత్త రెవెన్యూ చట్టాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి కెసిఆర్ కొత్త రెవెన్యూ చట్టంలో పొందుపరిచే అంశాలపై తుది కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రగతిభవన్‌లో శనివారం సిఎస్‌తో పాటు సిసిఎల్ అధికారులలో సిఎం చర్చించారు. కొత్త చట్టంలో చేయాల్సిన మార్పులు, చేర్పులపై మరింత కసరత్తు చేయాలని సిఎం అధికారులను ఆదేశించినట్టుగా తెలుస్తోంది. మరో రెండు రోజుల పాటు ఇదే విషయమై సిఎం అధికారులతో సమీక్షించనున్నట్టుగా తెలిసింది.

ప్రస్తుతం రాష్ట్రంలో పట్టాదారు పాసుపుస్తకాలు ఎన్ని ఉన్నాయి, ఇంకా ఎన్ని ఇవ్వాల్సి ఉంది, వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములు, భూముల విస్తీర్ణం తదితర విషయాలతో పాటు పోడు భూములు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నట్టుగా సమాచారం. ముఖ్యంగా విఆర్ఏ, విఆర్ఓలతో పాటు డిప్యూటీ కలెక్టర్‌లను ఏ ప్రభుత్వ విభాగాల్లో సర్దుబాటు చేయాలన్న దానిపై పూర్తి స్థాయిలో నివేదిక సమర్పించాలని కెసిఆర్ అధికారులను ఆదేశించినట్టుగా సమాచారం. ఇప్పటికే కొత్త రెవెన్యూ చట్టం ముసాయిదాను అధికారులు రూపొందించగా ప్రస్తుతం అందులో మార్పులు, చేర్పులపై అధికారులతో సిఎం కెసిఆర్ సమీక్ష జరుపుతున్నట్టుగా తెలిసింది. ప్రభుత్వం తీసుకొచ్చే కొత్త రెవెన్యూ కోడ్‌తో భూ లావాదేవీల స్వరూపమమే మారునున్నట్టుగా తెలిసింది. డివిజన్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో జరిగే రిజిస్ట్రేషన్లు ఇక మండల స్థాయిలో అందుబాటులోకి రానున్నట్టుగా సమాచారం.

తహసీల్దార్‌లు మండల ల్యాండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా వ్యవహరించేలా చట్టంలో మార్పులు చేయనున్నట్టుగా తెలిసింది. ప్రభుత్వం తహసీల్దార్‌ల అధికారాలపై కోత విధించాలని భావించిన నేపథ్యంలో వారి అధికారాలను ఏయే శాఖలకు అప్పగించా లన్న దానిపై అధికారులను సిఎం కెసిఆర్ అడిగి తెలుసుకున్నట్టుగా తెలుస్తోంది. అందులో భాగంగానే గతంలో ఉన్న 100 చట్టాలకు స్వస్తి పలికి కొత్త రెవెన్యూ కోడ్‌ను సిద్ధం చేయాలని కెసిఆర్ అధికారులను ఆదేశించినట్టుగా సమాచారం. ఆర్ఓఆర్ యాక్ట్ ప్రకారం భూముల మ్యుటేషన్ గడువు 90 రోజులుండగా, భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో నోటీసు పీరియడ్‌ను 15 రోజులకు తగ్గిస్తూ ప్రభుత్వం చట్టసవరణ చేసింది. అయితే రికార్డుల అప్‌డేషన్, కంప్యూటరీకరణతో రూపొందించిన డేటాబేస్ ఆధారంగా మ్యుటేషన్ ప్రాసెస్ ఇక నిమిషాల్లో పూర్తయ్యేలా కొత్త చట్టాన్ని రూపొందించినట్టుగా సమాచారం. దీంతోపాటు ఇతర శాఖల్లోకి విఆర్ఓ,విఆర్ఏ, డిప్యూటీ కలెక్టర్‌లను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తుదివెరుగులు దిద్దుతోన్న న్యాయ నిపుణులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారుల బృందం ఛాష్ఠంలో రెండేళ్లుగా చర్చనీయాంశంగా మారిన కొత్త రెవెన్యూ కోడ్‌కు నల్సార్ న్యాయ నిపుణులతో పాటు రిటైర్డ్ ఐఏఎస్ అధికారుల బృందం తుదివెరుగులు దిద్దుతోంది. ఇతర శాఖల్లోకి విఆర్ఓ, విఆర్ఏ. డిప్యూటీ కలెక్టర్‌ల సర్దుబాటు భూముల మ్యుటేషన్, పాస్‌బుక్‌ల జారీని సులభతరం చేయడం ఆర్డీఓలు, తహసీల్దార్‌ల అధికార పరిధిని నిర్ణయించడం ఇతర శాఖల్లోకి విఆర్ఓ, విఆర్ఏలను సర్దుబాటు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించినట్టుగా తెలిసింది. బ్రిటీష్ కాలం నాటి రెవెన్యూ శాఖకు కొత్త నిర్వచనం ఇవ్వాలని పాత అవ లక్షణాలను కనిపించకుండా కొత్త రెవెన్యూ కోడ్‌ను రూపొందించాలని అధికారులకు సిఎం కెసిఆర్ సూచించినట్టుగా తెలిసింది.

2021లో 10.9 శాతం తగ్గనున్న జీడీపీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్1: 2021 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 23.9 శాతం పడిపోనున్నదని, దీని తరువాత దేశం నిజమైన జీడీపీ ముందు కూడా ఎదురుదెబ్బ తగలవచ్చునని స్టేట్ బ్యాంక్ ఇండియా (ఎస్బీఐ) తాజా పరిశోధన నివేదిక ఎకోరాప్ లో వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. 2021 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 10.9 శాతం తగ్గవచ్చు. ఇది మునుపటి అంచనా కంటే 4.1 శాతం ఎక్కువ. ఇంతకుముందు, ఎస్బీఐ నిజమైన జీడీపీ వృద్ధిని -6.8 శాతంగా అంచనా వేసింది.

నాలుగో త్రైమాసికం జీడీపీ వృద్ధి 2020 లో 3.1 శాతం. అదే సమయంలో జీడీపీ వృద్ధి ఏడాది క్రితం ఇదే కాలంలో 5.2 శాతం. 2021 ఆర్థిక సంవత్సరంలో నాలుగు త్రైమాసికాలలో నిజమైన జీడీపీ వృద్ధి ప్రతికూలంగా ఉంటుందని ఎస్బీఐ ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి. ఈ కారణంగా పూర్తి సంవత్సరం నిజమైన జీడీపీ వృద్ధి రెండంకెలకు (10.9 శాతం) పడిపోయే ప్రమాదమున్నది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో నిజమైన జీడీపీ వృద్ధి -12 నుంచి -15 శాతం ఉంటుందని పరిశోధన నివేదిక అంచనా వేసింది. మూడో త్రైమాసికంలో ఇది -5 శాతం నుంచి -10 శాతం వరకు ఉంటుంది. వీరి నివేదిక ప్రకారం, నాలుగో త్రైమాసికంలో నిజమైన జీడీపీ వృద్ధి -2 నుంచి -5 శాతం ఉంటుంది. కరోనా వైరస్ మహమ్మారి వ్యాప్తి కారణంగా మార్చి 25 నుంచి విధించిన లాక్డౌన్ కారణంగా దేశ జీడీపీ వృద్ధి మొదటి త్రైమాసికంలో 23.9 శాతం క్షీణించిందని ఎస్బీఐ నివేదిక తెలిపింది.

రెండు సానుకూల విషయాలు

ఇటీవల రెండు సానుకూల విషయాలు కనిపించాయని తన నివేదికలో ఎస్బీఐ పేర్కొన్నది. మొదటిది జూలై నెలలో ఆర్బీఐ క్రెడిట్ డేటా. అన్ని ప్రధాన రంగాలలో జూలైలో రుణాల పెరుగుదల ఉన్నదని ఇది సూచిస్తుంది. ముఖ్యంగా మైక్రో, స్మాల్ ఎంటర్ప్రైజెస్ (ఎంఎస్ఈ), వ్యవసాయం, అనుబంధ రంగాలు, వ్యక్తిగత రుణ క్రెడిట్ గణనీయంగా పెరిగింది. ఇక రెండవది, మొదటి త్రైమాసికంలో వివిధ రంగాలకు కొత్త ప్రాజెక్టులు ప్రకటించడం. రహదారులు, ప్రాథమిక రసాయన, విద్యుత్, దవాఖానలు వంటి సమాజ సేవలు, నీరు, మురుగునీటి పైపులైన్లకు సంబంధించిన ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి.

నిర్మాణ, వాణిజ్యం, హోటళ్లు, విమాన యాన రంగాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉన్నదని పరిశోధన నివేదిక పేర్కొన్నది. అదనంగా రవాణా సేవలను పునరుద్ధరించాలని సూచించింది. ప్రభుత్వ ఆర్థిక చర్యలతో పాటు ఆర్బీఐ బాండ్లను జారీ చేయడం ద్వారా మౌలిక సదుపాయాలను పెంచాలని వెల్లడించింది.

ప్రణబ్ మరణం.. భారత్‌తో స్నేహానికి తీరని నష్టం: చైనా

బీజింగ్,సెప్టెంబర్1 : భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరణం భారత్, చైనా స్నేహానికి పెద్ద నష్టమని చైనా తెలిపింది. ఆయన మరణంపట్ల మంగళవారం ఆ దేశం సంతాపం వ్యక్తం చేసింది. మాజీ రాష్ట్రపతి ముఖర్జీ భారత రాజకీయ నేతల్లో ప్రముఖ వ్యక్తి అని కొనియాడింది. ఆయన 50 ఏండ్ల రాజకీయాల్లో చైనా, భారత్ సంబంధాలకు ఎంతో దోహదపడ్డారని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చునింగ్ మంగళవారం మీడియా సమావేశంలో అన్నారు. 2014లో తమ అధ్యక్షుడు జి జిన్‌పింగ్ భారత్ సందర్శించినప్పుడు నాడు రాష్ట్రపతిగా ఉన్న ప్రణబ్‌తో కలిసి ఇరుదేశాల భాగస్వామ్య నిర్మాణం కోసం సంయుక్త ప్రకటన చేసినట్లు గుర్తుచేశారు. 2016లో ముఖర్జీ చైనాను సందర్శించారని, చైనా నేతలతోపాటు వ్యాపార వర్గాలతో సమావేశమైనట్లు తెలిపారు. ప్రణబ్ మరణం భారత్‌తో పాటు చైనాతో సంబంధాలకు తీరని లోటు అని చెప్పారు. ముఖర్జీ మరణంపై మీడియా అడిగిన ఒక ప్రశ్నకు హువా చునింగ్ ఈ మేరకు సమాధానమిచ్చారు.

కర్ణాటక మంత్రి ఈశ్వరప్పకు కరోనా

బెంగళూరు, సెప్టెంబర్1: కరోనా మహమ్మారి విజృంభణ ఏ మాత్రం తగ్గడంలేదు. సామాన్యులు మొదలు ప్రజాప్రతినిధుల వరకు ఎవరినీ వదలకుండా తన ప్రతాపం చూపుతుంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కొన్ని రాష్ట్రాల్లో ఏకంగా ముఖ్యమంత్రులు కరోనా మహమ్మారి బారినపడ్డారు. తాజాగా కర్ణాటకలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల మంత్రి కేఎస్ ఈశ్వరప్పకు కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆయన సెల్ఫ్ ఐసోలేషన్‌లో ఉండి చికిత్స తీసుకుంటున్నారు. ఇటీవల కాలంలో తనను కలిసిన అధికారులు, ప్రజలు కరోనా పరీక్షలు చేయించుకుని క్వారెంటైన్‌లో ఉండాలని ఈశ్వరప్ప కోరారు.

అన్ని వ్యాక్సిన్‌లకు క్లినికల్ ట్రయల్స్ పూర్తవ్వాలి

తేడా వస్తే మరింత భయానకం..
నియంత్రణ కూడా కష్టమౌతుంది
ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక !!

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 1(ఆర్ఎన్ఎ): కరోనా దెబ్బకు యావత్ ప్రపంచం మొత్తం ఆగమాగం అవుతోంది. ఇటీవల కాలంలో మరెప్పుడూ లేని రీతిలో ప్రపంచం మొత్తం ఒకేలాంటి పరిస్థితి నెలకొన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అందరి ఫోకస్ ఈ మహమ్మారికి చెక్ పెట్టే వ్యాక్సిన్ ఎప్పుడు వస్తుందనే విషయం మీదనే. సాధారణంగా ఏదైనా వైరస్ కు వ్యాక్సిన్ కనుగొనాలంటే దాదాపు ఎడెనిమిదేళ్ల పాటు పరిశోధనలు జరిగే పరిస్థితి. యావత్ ప్రపంచం ఎఫెక్టు కావటం.. ఆర్థిక రంగాల మీద దారుణమైన ప్రభావాలు చూపిస్తున్న వేళ.. వ్యాక్సిన్ కనుగొనకపోతే.. చాలా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి. దీనికి తోడు జరుగుతున్న ప్రాణనష్టం ఆయా దేశాల్ని కలవరపాటుకు గురి చేస్తోంది. ఇదిలా ఉంటే.. వ్యాక్సిన్ కనుగొనటం కోసం పెద్ద ఎత్తున ప్రయోగాలు సాగుతున్నాయి. అదే సమయంలో లక్షల కోట్ల రూపాయిల వ్యాపారం కూడా ఇందులో దాగి ఉంది.

దీంతో.. వ్యాక్సిన్ ను రూపొందించటం కోసం భారీ ఎత్తున ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇప్పుడున్న పోటీలో తాము ముందు ఉన్నామని చెప్పుకునేందుకు కొన్ని దేశాలు ప్రయోగాలు పూర్తి కాకముందే.. వ్యాక్సిన్ వచ్చేసిందన్న ప్రచారం చేసుకోవటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ కొన్ని కీలకమైన వ్యాఖ్యలు చేసింది. సరైన క్లినికల్ ట్రయల్స్ జరుపుకోకుండా మార్కెట్లోకి వ్యాక్సిన్ వస్తే.. జరిగే ప్రమాదాల్ని.. చోటు చేసుకునే ముప్పును హెచ్చరిస్తూ ప్రకటన చేసింది. ఒక వ్యాక్సిన్ అన్ని క్లినికల్ ట్రయల్స్ జరుపుకోకుం డా మార్కెట్లోకి వస్తే దాని సైడ్ ఎఫెక్ట్స్ దారుణంగా ఉంటాయని హెచ్చరించింది. ఇలాంటి వ్యాక్సిన్ కారణంగా వైరస్ నాశనం కాకపోవటం కాదు.. మరింత బలోపేతం అవుతుందని.. దాని వల్ల దారుణమైన పరిణామాలు చోటు చేసుకుంటాయని పేర్కొంది. అదే జరిగితే సీన్ మళ్లీ మొదటికి వస్తుందని.. అప్పుడు నియంత్రణ కూడా కష్టమని పేర్కొంది. అందుకే.. అన్ని రకాలుగా క్లినికల్ ట్రయల్స్ జరగకుండా వ్యాక్సిన్లను మార్కెట్లోకి తీసుకురావటం ఏ మాత్రం మంచిది కాదన్న హెచ్చరికను చెప్పకనే చెప్పిందని చెప్పాలి. ఈ ప్రకటన ఎవరిని ఉద్దేశించిందన్న విషయంపై అందరికి అవగాహన ఉన్న నేపథ్యంలో.. మరి వారు తమ దూకుడును ఎలా నిలువరిస్తారో చూడాలి.

జిఎస్టీ ప్రతిపాదనలు ఆమోదయోగ్యంకాదు

ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర నిర్ణయాలు
జిఎస్టీ బకాయలు మొత్తం చెల్లించాల్సిందే
ప్రధాని మోడీకి సిఎం కెసిఆర్ లేఖ

హైదరాబాద్,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): జిఎస్టీ చెల్లింపుల్లో కేంద్రం తీరుపై సిఎం కెసిఆర్ అసమనం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూపొందించిన జీఎస్టీ కొత్త ప్రతిపాదనలపై అభ్యంతరం తెలుపుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల సమ్మతి లేకుండా జీఎస్టీ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే అని.. వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీఎం డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం పూర్తిగా చెల్లించాలని లేఖలో ప్రధానిని సీఎం కోరారు. కేంద్రం రుణం తీసుకుని రాష్ట్రాలకు పూర్తిగా పరిహారం ఇవ్వాలని కేసీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. పరిహారం తగ్గించాలని తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని కోరారు. కరోనా వైరస్ ప్రభావంతో రాష్ట్ర ఖజానాకు రావాల్సిన ఆదాయం భారీగా పడిపోయిందని, ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రతిపాదనలు ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. జీఎస్టీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితే.. దేశం అభివృద్ధి చెందినట్లే అని పేర్కొన్నారు. బలమైన రాష్ట్రాలు ఉంటేనే బలమైన దేశం అవుతుందన్నారు. కరోనా క్లిష్ట సమయంలోరుణాలపై ఆంక్షలు సహేతుకం కాదుని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ మంగళవారం ప్రధాని మోదీకి రాసిన లేఖలో పేర్కొన్న అంశాలు.. 'జాతీయ ప్రయోజనాల దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం జీఎస్టీ బిల్లును సమర్థించింది. మొట్టమొదలు స్పందించి అసెంబ్లీలో తీర్మానం చేసి పంపింది తెలంగాణ ప్రభుత్వమే. జీఎస్టీ ఫలాలు దీర్ఘకాలికంగా ఉండి.. రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రావడానికి దోహదపడుతుందని అనుకున్నాం. సీఎస్టీని రద్దు చేసే సమయంలో పూర్తి పరిహారాన్ని అందజేస్తామని అప్పటి యూపీఏ ప్రభుత్వం హామీ ఇచ్చింది. రాష్ట్రాలు సీఎస్టీ పరిహారాన్ని తిరస్కరించాయి. సరిగ్గా ఇదే కారణంపై రాష్ట్రాల ఒత్తిడి మేరకు రెవెన్యూ నష్టాన్ని పూడ్చడానికి ప్రతి రెండు నెలలకోసారి పూర్తి జీఎస్టీ పరిహారం చెల్లించే విధంగా చట్టంలో కచ్చితంగా నిబంధన ఉన్నా.. జీఎస్టీ పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతోంది. ఏప్రిల్ నుంచి రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం అందలేదు. కొవిడ్-19 కారణంగా 2020,ఏప్రిల్ లో తెలంగాణ 83 శాతం రెవెన్యూను నష్టపోయింది. అదే సమయంలో రాష్ట్రాల అవసరాలు, పేమెంట్ల భారం పెరిగిపోయింది. మార్కెట్ బారోయింగ్స్ ద్వారా, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్‌లు, ఓవర్ డ్రాఫ్ట్ ల ద్వారా ఈ పరిణామాల నుంచి గట్టెక్కాల్సి వచ్చింది. దేశ ఆర్థిక వ్యవస్థ, విత్త విధానం కేంద్రం చేతుల్లో ఉన్న కారణంగా రాష్ట్రాలు విధిగా కేంద్రంపై ఆధారపడే పరిస్థితులు నెలకొన్నాయి. మార్కెట్ బారోయింగ్‌లకు కేంద్రంపై ఆధారపడాల్సి వస్తుంది. ఇది సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని సీఎం లేఖలో పేర్కొన్నారు.

మరోమారు ఎల్ఆర్ఎస్ ప్రకటించిన ప్రభుత్వం

హైదరాబాద్,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ప్రకటించింది. ఆగస్టు 26వ తేదీ వరకు కటాఫ్ డేట్‌గా ప్రకటిస్తూ ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను ప్రకటించింది. టీఎస్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు ఎల్ఆర్ఎస్ వర్తిస్తుంది. అక్టోబర్ 15లోగా ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ నింపాలని ప్రభుత్వం సూచించింది. ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000, లే అవుట్ అప్లికేషన్ ఫీజు రూ.10వేలు, రెగ్యులరైజేషన్ ఫీజులు 100 గజాల లోపు ఎ÷-లాట్లకు గజానికి రూ.200 ఉంటుందని, 100 గజాల నుంచి 300 గజాల వరకు గజానికి రూ.400 ఉంటుందని, రెగ్యులరైజేషన్ ఫీజు 300 గజాల నుంచి 600 వరకు గజానికి రూ.600 రెగ్యులరైజేషన్ చార్జీ ఉంటుందని ప్రభుత్వం తెలిపింది.

దేశంలో కరోనా ఉగ్రరూపం..

కొత్తగా 69921 కరోనా పాజిటివ్ కేసులు నమోదు
36, 911,66కు చేరిన మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య

న్యూఢిల్లీ,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ మహమ్మారి రోజురోజుకీ మరింత వేగంగా.. ఊహించని విధంగా విసిగిస్తూ అందరినీ ఆందోళనకు గురి చేస్తోంది. తాజాగా గత 24 గంటల్లో కొత్తగా 69921 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీనితో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 36లక్షల 91వేల 166కి పెరిగింది. అలాగే కే 819 మంది చనిపోవడంతో మొత్తం మరణాల సంఖ్య 65వేల 288కి చేరింది. దేశంలో మరణాల రేటు 1.8 శాతంగా అంటే... ప్రతీ వెయ్యి మంది కరోనా సోకిన వారిలో 18 మంది మత్యువాత పడుతున్నారు. అలాగే దేశంలో తాజాగా మరో 65081 మంది కరోనా నుంచి కోలుకున్నారు. దీనితో మొత్తం రికవరీ కేసుల సంఖ్య 28లక్షల 39వేల 882గా ఉంది. దేశంలో రికవరీ రేటు 76.9 శాతంగా ఉంది. ప్రస్తుతం యాక్టివ్ కేసులు 785996 ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక కరోనా కేసులున్న దేశాల్లో... అమెరికా బ్రెజిల్ తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. అలాగే... కొత్త కేసుల నమోదులో భారతదేశం 27 రోజులుగా టాప్ పొజిషన్లో కొనసాగుతోంది. మొత్తం మరణాల్లో అమెరికా బ్రెజిల్ తర్వాత ఇండియా మూడో స్థానంలో ఉంది. రోజువారీ మరణాల్లో భారత్ మొదటి స్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాత బ్రెజిల్ అమెరికా ఉన్నాయి.

చరిత్రలో నేటినిజం



కం॥ కారణ జన్ము నిగ వెలుగు
శ్రీ రాజా రెడ్డి సుతకు శేముషీనాసగన
పారించె దయను కళగా
నిశజ నేత్రుంబు "యామిని రెడ్డి" పుణునే !!

(సెప్టెంబర్ 1 యామినీ రెడ్డి జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210

నేటినిజం
బుధవారం 2-9-2020

అరుదైన వ్యక్తిత్వం ప్రణబ్ సొంతం

విలువలతో కూడిన రాజకీయాలు నెరపడం ప్రస్తుత భారత రాజకీయాల్లో అస్సలు కదురదు. నిబద్ధతగా ఉంటానంటే ఉండనివ్వరు. ఎత్తులు పై ఎత్తులు వేస్తూ ఎదుటి పక్షాన్ని బురిడీ కొట్టించడంలో రాటుదేలాలి. రాజకీయాల్లో అందెవేసిన చేయి కావాలి. వ్యూహాలు పన్నగలిగే సామర్థ్యం ఉండాలి. అప్పుడే రాజకీయంగా నెగ్గుకు రాగలరు. భారతర రాజకీయాల పరిణామక్రమం చూస్తే ఇవన్నీ గుర్తుకు వస్తాయి. ఇందిరాగాంధీ సైతం ఇలాంటి ఎత్తులు పైఎత్తులు వేస్తూ ఎదిగిన వారే. ఆమె తన పదవిని కాపాడుకునే ప్రయత్నంలో అనేక వ్యూహాలు రచించారు. అనేక అడ్డదారులు తొక్కారు. అనేక రాజకీయాలు నెరిపారు. లేకుంటే ఆమెను ఏనాడో పాతాళానికి తొక్కేవారు. కానీ కొందరు మాత్రం అజాత శత్రువుల్లా తమ రాజకీయ జీవితాన్ని మలచు కుంటారు. వారికి నచ్చినట్లే ఉంటారు. పదవుల కోసం రాజీపడరు. తమ వ్యక్తిగత ప్రతిష్టను దిగ జార్చుకోరు. పదవుల కోసం బజారున పడరు. అలా ఉన్న వారిని ఉన్నత పదవులు వెతక్కుంటూ వస్తూనే ఉంటాయి. ఆ కోవ లోకే వస్తారు మన దివంగత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ. అలాగని ప్రణబ్ తెలివి తక్కువారు కాదని గుర్తించాలి. అసామాన్యుడుగా ఎదగడంలో మాత్రం ఆయన రాజకీయ అడ్డదారులు మాత్రం తొక్క లేదు. ఆధునిక రాజకీయాలను వంటబట్టించుకుని ట్రబుల్ షూటర్‌గా పేరు తెచ్చుకున్నారు. పివి నరసింహా రావు, వాజ్‌పేయ్ తరహాలో ఆయన రాజనీతిజ్ఞత ప్రదర్శించారు. చాణాక్యాన్ని చాటారు. ఎదుటి వారు అంటే తన పార్టీ వారు కష్టాల్లో ఉంటే ఎలా కాపాడాలో చూపారు. పదవుల కోసం వెంపర్లాడ కుండానే అనేకమైన ఉన్నత పదవులను అధిష్టించి మెప్పించారు. ప్రధాని పదవి దక్కలేదని తెలిసినా నింపాదిగా ఉండగలగడం ప్రణబ్ దాకు మాత్రేమే సాధ్యమయ్యింది. నిజానికి ఆయన సమర్థతను వినియో గించుకుని ఉంటే కాంగ్రెస్ ఇవాళ ఈ దుస్థితిలో ఉండేది కాదు. మన్మోహన్‌ను కాకుండా ప్రణబ్‌ను ప్రధాని పదవికి ఎంపిక చేస్తారని అంతా అనుకున్నారు. అలా చేసివుంటే కాంగ్రెస్ దశ మరోలా ఉండేది. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రణబ్ ముఖర్జీ ఎన్నో శాఖలు సమర్థంగా నిర్వహించారు. ఆర్థికశాఖతో మొదలు పెట్టి ఆయన కీలకమైన రాష్ట్రపతి పదవి వరకు అన్న పదవులను నిర్వహించినా ఎక్కడా తనదైన ముద్ర నుంచి బయటపడలేదు. అలాగే ఎక్కడా అవినీతి పంకిలం అంటకుండా జాగ్రత్త పడ్డారు. భారత నవీన రాజకీయాల్లో ఇలా మెలగడం అన్నది గతంలో పివి నరసింహారావు, వాజ్‌పేయ్ వంటి వారికే దక్కింది. ఆ కోవలో ప్రణబ్ కూడా అజాత శత్రువుగా భారతరాజకీయాల్లో తన పేజీని లిఖించారు. అసామాన్య తెలివితేటలు ఉన్న నేతగా అందరితో సాన్నిహిత్యం వున్న అరుదైన నాయకుడు ప్రణబ్ ముఖర్జీ. విధేయత కారణంగా ఇందిరాగాంధీ ఆయనను చేరదీసింది. ఆ విధేయతే ఆయనను ఎమర్జన్సీలోనూ ఇందిరను వెన్నంటి ఉండేలా చేసింది. బెంగాల్‌లో ఆమెకు చాలా సన్నిహితుడు మాత్రమే గాక ఎమర్జన్సీ విధించాలని సలహా ఇచ్చిన సిద్దార్థ శంకర్ రే కూడా తర్వాత మారిపోయినా.. ప్రణబ్ మా త్రం మారలేదు. ఎమర్జెన్సీకి సంబంధి ంచి లోలోపల బాధ ఉన్నా తనను అందులో ఇరికించవద్దని అనేవారు. ఇందిర హత్య తరవాత తాత్కాలిక ప్రధానిగా అయినా తన పేరును పరిశీలిస్తారని మాత్రం భంగపడ్డారు. రాజీవ్‌తో విభేదించి వేరుకుంపటి పెట్టుకున్నా..మళ్లీ పివి నరసింహారావు పెద్దరికంతో మళ్లీ పదవిని చేపట్టారు. సోనియాగాంధీని విదేశీయురాలనే దుమారం రేగినపుడు ప్రణబ్ తిరిగివచ్చి ఆమెకు అండగా నిబడ్డారు. యుపిఎ ప్రభుత్వంలో ప్రధానిని కాగలరని అంతా అనుకున్నా ఎందుకనో సోనియా ఆయనను పక్కన పెట్టారు. అయితే ఏనాడూ ఆయన మళ్లీ కాంగ్రెస్‌ను వీడాలని అనుకోకుండా ముందుకు సాగడం ద్వారా తన రాజనీతిని చాటుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రెండు దశాబ్దాలకు రాజకీయాలలోకి వచ్చినా ఎక్కడా నీతిమాలిన రాజకీయాలను వంటబట్టించుకోలేదు.

బెంగాలీ మూలం, జర్నలిస్టుగా పనిచేయడం, మంచి చదువరి కావడం ఆయన రాజకీయ ప్రయాణానికి పునాది ఏర్పడింది. రాజకీయాల నిర్వహణలోని చాకచక్యం ఆయనను త్వరగా ఉన్నత స్థానాలకు చేర్చిందనే చెప్పాలి. బాధ్యతలను నిర్వహించే సామర్థ్యం, విధేయత, తగవులను పరిష్కరించే లౌక్యం వంటివి ఆయన విజయసోపానాలకు తోడ్పడ్డాయి. అందుకే ఆయనను ట్రబుల్ షూటర్ అంటారు. తెలంగాణ సమస్యను నెత్తిన వేసుకుని దానిని పరిష్కరించే క్రమంలో నిజంగానే రాజకీయచతురతను ప్రదర్శించారు. ప్రధాని కాలేకపోయినా, యుపిఎ మొదటి, రెండో పదవీకాలాలలో ప్రధాన కార్యనిర్వహణ అంతా ఆయన చేతుల మీదే సాగిందని గమనించవచ్చు. పార్టీలో, ప్రభుత్వంలో వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో ఆయన నిష్ణాతులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన విషయంలో కూడా ఆయన పాత్ర కీలకం. పైకి ఎప్పుడూ ఎటువంటి వ్యాఖ్యలూ చేయకపోయినా, తెలంగాణ ఏర్పాటుపై నియమించిన పార్టీ కమిటీ నాయకుడిగా ఆయన సమస్యను అధ్యయనం చేసి, అధిష్ఠానానికి తగిన మార్గదర్శనం చేశారు. రాష్ట్ర అవతరణకు సహాయపడిన వారిగా ప్రణబ్‌ను తెలంగాణవాదులు, ప్రభుత్వం స్మరించుకుంటారు. అట్లాగే, ఆయన ఆధ్వర్యంలోని అనేక మంత్రుల కమిటీలు వేర్వేరు అంశాలపై ప్రభుత్వ నిర్వహణకు దోహదం చేసి ఉంటాయి. రాష్ట్రపతిగా ఆయన కేవలం రబ్బరు స్టాంపుగా కనిపించకుండా తనదైన శైలిలో నడిచారు. తీసుకొచ్చారు. అందుకే ఆధునిక రాజకీయాల్లో ప్రధాని మోడీ కూడా ప్రణబ్‌ను బాగా గౌరవించారు. ఆయన అంటే అభిమానం పెంచుకున్నారు. ప్రణబ్ ముఖర్జీ నిష్క్రమణతో నిజాయితీతో కూడిన రాజకీయవాదుల తరం ముగిసి పోయింది. జాతీయోద్యమంలో పాల్గొని స్వాతంత్ర్యానంతర తొలి దశాబ్దాలలో ప్రజా జీవితంలో, అధికారంలో ఉన్న తొలి తరం వేరు. పూర్వపు తరానికి, అనంతరపు నేతలకు మధ్యస్థంగా, ఉన్నత విలువలూ కొంత వ్యూహరచనల కలబోతగా మిగిలిన నేతగా ప్రణబ్ గుర్తుకు వస్తారు. అలాంటి నేతలు ఇకముందు వస్తారనుకోవడం భ్రమే అవుతుంది. ఆ విధంగా ప్రణబ్ తనకంటూ ఓ చరిత్రను రాసుకున్నారు. ప్రజల మన్ననలు పొందిన నేతగా నిష్క్రమించారు.

కరోనా రోగుల కోసం అత్యాధునిక పరికరాలు

-సిఎస్ సోమేశ్‌కు అందచేసిన ఫ్రెంచ్ కంపెనీ

హైదరాబాద్,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): కరోనా రోగులకు అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే హై ఫ్లోనాసల్ కాన్యులా (హెచ్ఎఫ్ఎన్సి) పరికరాలను ఫ్రెంచ్ మల్టీనేషనల్ కంపెనీ ప్రభుత్వానికి అందజేసింది. ఫ్రెంచ్‌కు చెందిన పెర్నాడ్‌రికర్డ్ ఇండియా సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద 100 హెచ్ఎఫ్ఎన్సి పరికరాలను ప్రభుత్వప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు అందజేసింది. ఈసందర్భంగా సంస్థ కార్పొరేట్ వ్యవహారాల హెడ్ రాజేశ్‌పరీదా, ఇతర ఉన్నతాధికారులు సీఎస్‌ను కలిసిన వారిలో ఉన్నారు. కరోనా బారినపడిన వారికి లైఫ్‌సేవింగ్ ఎమర్జెన్సీ ఇన్‌స్ట్రుమెంట్స్‌గా హెచ్ఎఫ్ఎన్సిని ఉపయోగిస్తారు. వీటి ద్వారా రోగులకు హైఆక్సీజన్‌సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది. కాగా రాష్ట్రంలోని ముఖ్యమైన హాస్పిటల్స్‌లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. గాంధీ, నిమ్స్, కింగ్‌కోఠి, చెస్ట్, టిమ్స్ హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేయనున్నట్టు టిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు.

సిఎఎ వ్యతిరేక అల్లర్లలో తాహిర్ అరెస్ట్

న్యూఢిల్లీ,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): సీఏఏకు వ్యతిరేకంగా ఫిబ్రవరిలో జరిగిన అల్లర్ల కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ బహిష్కృత నేత తాహిర్ హుస్సేన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ పోలీసులు అరెస్టు చేశారు. మనీల్యాండరింగ్ కేసులో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆరు రోజుల కస్టడీ రిమాండ్ కోరుతూ ఈడీ కోర్టును ఆశ్రయించింది. సీఏఏ వ్యతిరేక ప్రదర్శనల కోసం ఆప్ మాజీ కౌన్సిలర్ అక్రమపద్ధతిలో ఆదాయం సమకూర్చినట్లు తేలింది. ఢిల్లీ అల్లర్ల కేసులో ప్రస్తుతం తీహార్ జైలులో తాహిర్ ఉంటున్నాడు. అయితే విచారణ నిమిత్తం అతన్ని ఈడీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. హవాలా ఆపరేటర్లతో టచ్‌లో ఉన్న అంశాన్ని కూడా తాహిర్‌ను ప్రశ్నించనున్నట్లు ఈడీ అధికారులు చెప్పారు. తబ్లీగ్ జమాత్ చీఫ్ మౌలానా సాద్‌తో ఉన్న లింకుల గురించి కూడా అతన్ని ప్రశ్నించనున్నారు. ఐబీ అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో కూడా తాహిర్‌ను అరెస్టు చేశారు. ఢిల్లీ అల్లర్లో తన పాత్ర ఉన్నట్లు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ విచారణలో తాహిర్ అంగీకరించాడు. పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 24వ తేదీన ఢిల్లీలో భారీ ఎత్తున అల్లర్లు జరిగాయి. ఆ అల్లర్లలో 53 మంది చనిపోయారు.

సిఎం అపాయింట్‌మెంట్ కోరా: జగ్గారెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్1ఆర్ఎన్ఎ): రైతులు, మహిళలు, ప్రజల సమస్యలపై మెమోరాండం ఇవ్వడానికి సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖ రాశానని సంగరెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే సెప్టెంబర్ 2న ప్రగతి భవన్ వద్ద నిరసన తెలుపుతానని జగ్గారెడ్డి ప్రకటించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించిందని, కరోనాను ఆరోగ్య శ్రీలో చేర్చమని కోరినా చేర్చడం లేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వం రాకపోవడం వల్లే ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతున్నానని జగ్గారెడ్డి చెప్పారు.

టిఎన్జీవో నూతన అధ్యక్షుడిగా మామిళ్ల రాజేందర్

కారెం రవీందర్ రెడ్డి పదవీ విరమణతో ఏకగ్రీవ ఎన్నిక

ఉద్యోగుల హామీల అమలుకు పాటుపడుతానన్న రాజేందర్

హైదరాబాద్,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): పదవీవిరమణ వయసు పెంపుతో పాటు అనేక హామీలను అమలు చేయాల్సి ఉందని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ టీఎన్జీఓఏ తెలిపింది. ఎన్నికలకు ముందు సిఎం కెసిఆర్ హామీలు ఇచ్చారని అన్నారు. ఇదిలావుంటు టిఎన్జీవో రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా మామిళ్ల రాజేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి పదవీవిరమణ నేపథ్యంలో... సోమవారం జరిగిన టీఎన్జీఓఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంది. జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఉద్యోగుల హక్కుల సాధన విషయంలో రాజీ లేని పోరాటం సాగిస్తామని రాజేందర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇదే క్రమంలో... ఉద్యోగుల సూచనల మేరకు భవిష్యత్తు కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు. ఉద్యోగులు తనపై విశ్వాసం ప్రకటించి, సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. టీఎన్జీఓఏ అధ్యక్షునిగా ఎన్నికైన రాజేందర్‌ను పలువురు ఉద్యోగ నేతలు, ప్రభుత్వ ప్రతినిధులు అభినందించారు. రాజేందర్ ఇప్పటివరకు ప్రధానకార్యదర్శిగా బాధ్యతలను నిర్వర్తించారు. ఆఫీసు సూపరింటెండెంట్ గా రంగారెడ్డి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ కార్యాలయంలో రాజేందర్ పనిచేస్తున్నారు. కాగా... 1986లో సంగారెడ్డి వైద్య ఆరోగ్య శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా రాజేందర్ తన కెరీర్ ను ప్రారంభించారు. ఆ తర్వాత... 1990 లో సీనియర్ అసిస్టెంట్‌గా, 2011లో ఆఫీసు సూపరింటెండెంట్‌గా సంగారెడ్డి డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో పనిచేస్తూ, ప్రస్తుతం ఆఫీసు సూపరింటెండెంట్‌గా రంగారెడ్డి డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. 1964 లో జన్మించిన రాజేందర్... టీఎన్జీవో సంఘంలో 1990 లో సంగారెడ్డి పట్టణ శాఖ కోశాధికారిగా అరంగేట్రం చేసి, 1992 లో కేంద్ర సంఘం కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. అప్పటి అధ్యక్షులు స్వామినాథం, ప్రధానకార్యదర్శి కే. కృష్ణారెడ్డి నేతృత్వంలో రాజేందర్ బాధ్యతలను నిర్వర్తించారు.ఆ తర్వాత... 1998 నుండి 2007 వరకు సంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. అటుపై 2007 నుండి 2011 వరకు సంగారెడ్డి అధ్యక్షునిగా పని చేశారు. ఆ తర్వాత... 2016 లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మొదటిసారిగా ఎన్నికయ్యారు. అప్పటినుంచి సోమవారం వరకు ప్రధానకార్యదర్శిగా బాధ్యతలను నిర్వర్తించారు. టీఎన్జీవో సంఘంలో కింది స్థాయి నుండి రాష్ట్ర అధ్యక్ష స్థాయి వరకు కొనసాగిన క్రమంలో... రాజేందర్ పలు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. టీఎన్జీఓఏ మెదక్ జిల్లా అప్పటి అధ్యక్షుడు దేవీప్రసాద్ నేతృత్వంలో రాజేందర్... ఉద్యోగుల హక్కుల సాధన ఉద్యమాలతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాలకు నాయకత్వం వహించారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా... సిద్దిపేట ఉద్యోగ గర్జన మొదలుకొని సహాయ నిరాకరణ, సకలజనుల సమ్మె, సడక్ బంద్ వంటి పలు కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. ఇదే క్రమంలో... ఉద్యోగుల హక్కుల సాధన ఉద్యమంతోపాటు మెరుగైన పీఆర్సీ లను సాధించేందుకు పోరాడారు. తాజాగా సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రణబ్ దాదా...అల్విదా...!

(మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి అక్షర నివాళి)

ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక ఉన్నత పదవులు సమర్థవంతంగా చేపట్టి, పేరు ప్రఖ్యాతులు గడించి, భారత 13వ రాష్ట్రపతిగా (2012-17) దేశానికి సేవలందించిన 'భారతరత్న' ప్రణబ్ ముఖర్జీ జాతీయ అంతర్జాతీయంగా నిబద్ధతగల ఆదర్శ నాయకుడుగా, ప్రజా సేవకుడుగా తనదైన ముద్ర వేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర భీర్‌భం జిల్లాలోని మిరాటి గ్రామంలోని బెంగాలీ కుటుంబంలో కమద కింకర్ ముఖర్జీ మరియు రాజ్యలక్ష్మిలకు 11 డిసెంబర్ 1935న జన్మించారు ప్రణబ్ ముఖర్జీ. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న తండ్రి కమద కింకర్ 1952-64 మధ్య బెంగాల్‌లో యంయల్‌సిగా మరియు ఏఐసిసి సభ్యుడుగా సేవలందించి, ప్రణబ్‌కు ఆదర్శ పితగా రాజకీయ క్షేత్రానికి దారి చూపారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో యంఎ రాజనీతి శాస్త్రం మరియు చరిత్రలో పట్టాలు పొంది, యల్‌యల్‌బి పూర్తి చేశారు. రాజకీయాల్లోకి ప్రవేశించటానికి పూర్వం తంతి తపాలాల కార్యాలయంలో క్లర్క్ ఉద్యోగం, కాలేజ్‌లో లెక్చరర్ మరియు జర్నలిస్ట్ బాధ్యతలను స్వల్ప కాలం చేపట్టిన పిదప 1969లో రాజకీయరంగ ప్రవేశం చేశారు.

అప్పటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ దృష్టిని ఆకర్షించి అఖిల జాతీయ కాంగ్రెస్‌లో తన విలక్షణ సేవలను అందిస్తూ, 1969లో రాజ్యసభ సభ్యుడుగా ఎన్నికైనారు. అనంతర కాలంలో 1975, 1981, 1993 మరియు 1999లలో రాజ్యసభ సభ్యుడుగా ఎన్నికైనారు.గాంధీ కుటుంబానికి నమ్మిన భంటుగా అనేక సందర్భాలలో జటిల సమస్యలను సులభంగా పరిష్కరించే మేధావిగానే కాకుండా "మ్యాన్ ఆఫ్ ఆల్ సీజన్స్"గా ప్రత్యేక గుర్తింపు పొందారు. కేంద్ర ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ (193-74), షిప్పింగ్ మరియు ట్రాన్స్ పోర్ట్ శాఖ (1974), ఆర్థిక శాఖ స్టేట్ (1974-75), రెవెన్యూ మరియు బ్యాంకింగ్ శాఖ (1975-77), కామర్స్ స్టీల్ మరియు మైన్స్ శాఖ (1980-82), ఆర్థిక శాఖ (1982-84 మరియు 2009-12), కామర్స్ మరియు సప్లై శాఖ (1984), వాణిజ్య శాఖ (1993-95), విదేశీ వ్యవహారాల శాఖ (1995-96 మరియు 2006-09), రక్షణ శాఖ (2004-06)లకు మంత్రిగా సమర్థవంతమైన సేవలను సుదీర్ఘకాలం అందించారు. ఇవే కాకుండా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి, లీడర్ ఆఫ్ రాజ్యసభ, ప్రపంచ బ్యాంక్, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ మరియు అంతర్జాతీయ ద్రవ్యనిధి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్, ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్, సార్క్ కౌన్సిల్ ఆఫ్ మినిస్టర్స్ అధ్యక్షుడుగ, లీడర్ ఆఫ్ లోకసభ, ఏఐసిసి జనరల్ సెక్రెటరీ, పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు లాంటి వివిధ బాధ్యతలను సమర్థవంతంగా చేపట్టిన ధీరుడు ప్రణబ్ ముఖర్జీ.

భారతదేశ 13వ రాష్ట్రపతిగా 25 జూలై 2012 నుండి 25 జూలై 2017 వరకు ప్రథమ పౌరుడిగా విధులు నిర్వహించిన ప్రణబ్ విశిష్ట సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2019లో "భారతరత్న" పురస్కారంతో సన్మానించింది. దీనికి తోడుగా పద్మ విభూషణ్ (2008) ఆవార్డు కూడా వారిని వరించింది. అంతర్జాతీయ వేదికలో బంగ్లాదేశ్ లిబరేషన్ వార్ ఆనర్ (2013), నేషనల్ ఆనర్ ఆఫ్ ఐవరీ కోస్ట్ (2016), సైప్రస్ వారందించిన ఆర్డర్ ఆఫ్ మకారియోస్ (2017) పురస్కారాలను పొందారు. ప్రణబ్ ముఖర్జీ ప్రతిభను గుర్తించిన 16కు పైగా దేశ విదేశీ విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌లను అందించాయి. ప్రపంచ ఉత్తమ ఆర్థికశాఖ మంత్రి (1984), ఏసియా ఉత్తమ ఆర్థిక శాఖ మంత్రి (2010) మరియు దేశ ఉత్తమ ఆర్థిక శాఖామాత్యులు(2010)గా పురస్కారాలను పొంది దేశ ప్రతిష్టను ఇనుమడింపజేశారు. అపర చాణక్యుడు, రాజకీయ దురంధరుడు, ట్రబుల్ షూటర్‌గా పేరొందిన మేధావి మరియు బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రణబ్ ముఖర్జీ పలు పుస్తకాలను రచించారు. తన అపూర్వ రాజకీయ సామాజిక అనుభవాలను జోడించి మిడ్‌టర్మ్ పోల్, ఛాలెంజెస్ బిఫోర్ ది నేషన్, థాట్స్ అండ్ రిఫ్లెక్షన్స్, ది టర్బ్యులెంట్ ఇయర్స్, కోలిషన్ ఇయర్స్ లాంటి ముఖ్య గ్రంథాలను తీసుకువచ్చారు.

1984లో ఇందిరా గాంధీ హత్యానంతరం దేశ ప్రధానిగా అనుభవం లేని రాజీవ్ గాంధీని వ్యతిరేకించిన ప్రణబ్‌కు ప్రాధాన్యత తగ్గడంతో కాంగ్రెస్‌ను వీడి స్వంత పార్టీ రాష్ట్రీయ సమాజ్‌వాదీ కాంగ్రెస్‌ను స్థాపించి పరాజయం పాలైనారు. 1989లో తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి, 1991లో రాజీవ్ హత్య అనంతరకాలంలో పి వి నరసింహారావు ప్రధానమంత్రి సమయంలో తిరిగి పార్టీ మరియు ప్రభుత్వంలో తన పట్టు మరియు సత్తా చాటుకున్నారు. గాంధీ కుటుంబానికి విధేయుడిగా 1975-77 ఎమర్జన్సీ కాలంలో వివాదాస్పదుడుగా పలు విమర్శలను ఎదుర్కొన్నారు. 1998లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష స్థానంలో సోనియాగాంధీని ఎన్నికొనుటతో పాటు నమ్మకమైన ముఖ్య సలహాదారుగా ప్రధాన భూమిక నిర్వహించారు. సోనియా గాంధీ ప్రధానమంత్రిగా అంగీకరించని సమయంలో ఆ పదవిని ఆశించి (మన్మోహన్‌సింగ్ చేపట్టగా) విఫలమైనారు. తన ఐదు దశాబ్దాల రాజకీయ చరిత్రలో 2004లో పశ్చిమ బెంగాల్ జంగీపూర్ నియోజకవర్గం నుండి తొలిసారి లోకసభ ఎన్నికల్లో గెలుపొందారు. మాజీ రాష్ట్రపతిగా ఆర్‌యస్‌యస్ సమ్మేళనంలో తన సందేశమిచ్చి అందరిని ఆశ్చర్య పరిచారు. 1977లో కాంగ్రెస్ ఓటమి తరువాత జనతా ప్రభుత్వ హయాంలో 'షా కమీషన్' దర్యాప్తును ఎదుర్కొన్ని బయట పడ్డారు. 1982-84 మధ్య కేంద్ర ఆర్థిక శాఖామాత్యులుగా ఐయంయఫ్ చివరి ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించి దేశ ప్రతిష్టను పెంచడమే కాకుండా ఆర్‌బిఐ గవర్నర్‌గా మన్మోహన్ సింగ్‌ను నియమించిన ఘనత ప్రణబ్ ముఖర్జీది. అత్యున్నత ప్రతిభ, అనుభవం, సంక్లిష్ట ముడులు విప్పే చాతుర్యం కలిగిన ప్రణబ్ దాదా ఆదర్శ నేతగా, ప్రధాని హాజరు కాలేని సందర్భంలో కేబినెట్ సమావేశాలకు కూడా అధ్యక్షత వహించారు. జనాకర్షణ కలిగిన నేతగా కొంత విఫలమైనా, అపర మేధావిగా పేరొందిన ప్రణబ్, ప్రధానమంత్రిగా తన చిరకాల వాంఛను తీర్చుకోలేక పోయారు.

2012లో కాంగ్రెస్‌కి రాజీనామా చేసి రాష్ట్రపతిగా ఐదేళ్ళు సేవలందించారు. ఇందిర/రాజీవ్ పాలనలో కోర్ టీం సభ్యులుగా ప్రణబ్, పివి మరియు ఆర్ వెంకటరామన్‌ల త్రయం విశిష్ట సేవలు అందించారు. వీరిలో పివి ప్రధానిగా, మింగిన ఇద్దరు రాష్ట్రపతులుగా పని చేశారు. పార్లమెంటరీ పరిజ్ఞానం, మానవ సంబంధాలు, చతురత, అపార అనుభవం గుర్తించి ప్రణబ్‌ను ''భారత ఉత్తమ పరిపాలనాదక్షుడు-2011" అవార్డును తీసుకున్నారు. ధర్మపత్ని సువ్రా ముఖర్జీని 1957లో వివాహమాడి ఇద్దరు కుమారులు మరియు ఒక కుమార్తెకు జన్మనిచ్చారు. డెంగ్ గ్జియోపింగ్‌తో స్ఫూర్తిని పొందానని చెప్పుకున్న ప్రణబ్‌కు రీడింగ్, గార్డెనింగ్ మరియు సంగీతాలు హాబీలుగా మార్చుకొన్నారు. ఏ క్లిష్ట సమయంలోనైనా నిబ్బరంగా ఉంటూ, సమస్యలను గట్టెంకించటం ప్రణబ్ దాదాకే ప్రత్యేకం. కోవిడ్-19 సోకడంతో పాటు మెదడుతో రక్తం గడ్డకట్టడంతో ఢిల్లీ ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడవడం విచారకరం. ఆంధ్ర రాష్ట్ర విభజన ఉద్యమ సమయంలో ఏర్పాటు చేసిన కమిటీకి అధ్యక్షత వహించి ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేసారు. పార్టీలకు అతీతంగా అజాత శత్రువుగా, మహా మేధావిగా, స్టేట్స్ మెన్‌గా, రాజకీయ కురువృద్ధుడుగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రణబ్ ముఖర్జీ చేసిన సేవలు అనన్య సామాన్యాలు మరియు అనితర సాధ్యాలు. వారికి భరతజాతి రుణపడి ఉంది. భరతజాతి రత్నమైన ప్రణబ్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ, ఆకాంక్షలను నెరవేర్చడమే వారికి మనం సమర్పించే ఘన నివాళి.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

వినయం వివేకం ప్రణబ్ సొంతం

వివాదాస్పద రాజకీయాలకు ఎప్పుడూ దూరం

ఎప్పటికీ స్ఫూర్తిగా ఆయన రాజకీయ జీవితం

న్యూఢిల్లీ,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): పదవిలో వుండగానే తన సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని మూడు భాగాలుగా రాసిన ఒకే ఒక రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీ చరిత్రలో నిలుస్తారు. అభిప్రాయాలు నిక్కచ్చిగా చెప్పే ప్రణబ్ దా అందులోనూ తన భావాలు ఏమాత్రం దాచుకోలేదు. తమ నాయకత్వంతో తాను విభేదించిన అంశాలు తనకు వస్తాయనుకున్న అవకాశాలు ఎలా దూరమైనాయనేది కూడా నిర్మొహమాటంగా రాసుకున్న మేధావి ఆయన. రాష్ట్రపతి భవన్‌ను ఆయన ప్రజలకు చేరువ చేశారు. అలాగే ప్రతిపక్షాలకు కూడా భరోసా కలిగించారు. సమస్యలను చెప్పుకునే వేదికగా రాజ్‌భవన్‌ను తీర్చి దిద్దారు. అలా ప్రతిపక్షాల ప్రతినిధి వర్గాలను కుసుకోవడానికి చాలా అవకాశాలు ఇచ్చారు. రాష్ట్రపతిగా పదవీ కాలం మధ్యలో నరేంద్ర మోడీ ప్రధాని పదవి చేపట్టినా రాజ్యాంగ నిబంధన ప్రకారం సజావుగా సాగేందుకు ప్రాధాన్యత నిచ్చారు. మోడీ కూడా ఆయనతో దగ్గరగా వుండేందుకు ఎంతగానో ప్రయత్నించడం చూశాం. ఎందుకంటే అందరికీ ప్రణబ్ దా అంటే పెద్దాయన అనిపించుకున్నారు. పదవీ కాలం చివరలో స్వగ్రామం సందర్శించి మూలాలు మర్చిపోరాదనే సందేశం ఇచ్చారు. ఆయన కన్నుమూతతో దేశం ఒక సమున్నత రాజనీతివేత్తను పాలనా చతురుడైన వ్యూహకర్తను కోల్పోయింది. గౌరవప్రదంగా క్రియాశీల జీవితం నుంచి సెలవు తీసుకున్న ఒక సమున్నత నేత ప్రస్థానం ఆయనది. ఇక తెలంగాణ ఉద్యమ క్రమంలో ప్రణబ్ కమిటీ నిరంతర ప్రస్తావనగా వుండేది. మీడియాతోనూ ఆయన సూటిగా పొదుఎ ్రగా మాట్లాడేవారు. కొన్నిసార్లు కఠినంగానూ వుండేది.

ఆరెస్సెస్ వేదికకు ఆహ్వానించినప్పుడు ఏం చెబుతారనే ఆసక్తి నెలకొనగా లౌకికతత్వం అవసరం చెప్పి వచ్చారు. ప్రణబ్‌దా జీవితం పరిశీలిస్తే ఆయన పెద్దగా ప్రజాపునాది వున్న నేతకాదు. ఆ కాలంలో బెంగాల్‌లో సి పి ఎం అప్రతిహతంగా పాలిస్తున్న పరిస్థితి. రాజకీయంగా తీవ్రంగా వ్యతిరేకిస్తూనే జ్యోతిబసు వంటివారిత

దళితుల భూములు లాక్కుంటున్నారు

సిద్దిపేట కార్యాలయం కోసం 200 ఎకరాలు గుంజారు: మందకృష్ణ

నిర్మల్,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): డంపింగ్ యార్డులు, రైతు వేదిక నిర్మాణాల పేరుతో దళితుల భూములను లాక్కుంటున్నారని కేసీఆర్ ప్రభుత్వంపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఏర్పడితే జీవితాలు బాగుపడతాయనుకుంటే ఇలా దళిత వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ సీఎం కావడంతోనే మోసపోయాం. మాదిగలపై కేసీఆర్‌కు ప్రేమ లేదు. ఆనాడు వ్యతిరేకత రాకూడదనే తాత్కాలికంగా రాజయ్యను ఉప ముఖ్యమంత్రిని చేశారు. దళితులకు మూడెకరాల భూమి ఊసే లేకుండా పోయింది. సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం కోసం దుద్దెడ గ్రామం వద్ద రెండు వందల ఎకరాల దళితుల భూములను లాక్కున్నారు. దాని చుట్టూ ఉన్న అగ్రవర్ణాల భూములను మాత్రం తీసుకోలేదు. దళితుల భూములు లాక్కోవడానికి ప్రతిపక్షాల బలహీనత కూడా ఒక కారణం. భూములు లాక్కోవడంపై ప్రతిపక్ష నేతలు ఒక్క రోజైనా మాట్లాడకపోవడం శోచనీయం అని మందకృష్ణ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా ప్రతినిధులను వదలని మహమ్మారి

-ఏపీ శాసనమండలి చైర్మన్ షరీఫ్‌కు కరోనా

అమరావతి,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ లో కరోనా మహమ్మారి అంతకంతకు విజృంభిస్తూనే ఉంది. ప్రతిరోజు కూడా దాదాపుగా పదివేలకు పైగా పాజిటివ్ కేసులు వెలుగులోకి వస్తున్నాయి. సామాన్యుల నుండి.. రాజకీయ ప్రముఖులు.. ప్రజా ప్రతినిధులు ఈ మహమ్మారి బారిన పడుతున్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు.. మంత్రులు.. మాజీ మంత్రులు.. ఎంపీలు కరోనా బారిన పడగా.. తాజాగా శాసనమండలి చైర్మన్ కరోనా బారిన పడ్డారు. ఏపీ శాసనమండలి చైర్మన్ షరీఫ్కు కరోనా సోకింది. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఆయన్ను హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. షరీఫ్ త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్సీలు తెదేపా నేతలు ఆకాంక్షించారు. ఇకపోతే ఏపీలో ఇప్పటి వరకు ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా మంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి మంత్రి ఆదిమూలపు సురేష్ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి సహా పలువురు వైసీపీ ఎమ్మెల్యేలకు కరోనా పాజిటివ్గా నిర్ధారణ అయింది. విజయనగరం జిల్లా ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసులు గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి గుంటూరు జిల్లా సత్తెనపల్లి ఎమ్మెల్యే అంబటి రాంబాబు గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం నర్సరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిలతో పాటూ మరికొందరు కరోనా బారిన పడ్డారు. మరోవైపు కరోనా కేసుల నమోదులో సంఖ్యాపరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో రెరడో స్థానానికి చేరింది. ఇప్పటివరకూ ఆ స్థానంలో ఉన్న తమిళనాడును వెనక్కు నెట్టి ఆ స్థానాన్ని ఏపీ ఆక్రమించింది. మహారాష్ట్ర 780689 కేసులతో తొలిస్థానంలో ఉంది.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

-మరింత ఉధృతంగా సాగుతున్న ప్రాణహిత

ఆదిబలాబాద్,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 15 రోజులుగా నీటి విడుదల కొనసాగుతూనే ఉంది. వర్షాల కారణంగా ఎగువ నుంచి నీరు జలాశయంలో చేరుతుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. వరద నీటితో నీటి మట్టం పెరుగుతుండటంతో 16938 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుండటంతో రెండు గేట్లను ఎత్తి నీటిని గోదావరిలోకి వదిలారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్‌కు, మిషన్ భగీరథకు 570 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మరోవైపు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు మేడిగడ్డ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నదిలో చేరడంతో కోటపల్లి మండలాన్ని ఆనుకొని ప్రవహిస్తున్న ప్రాణహిత నది సోమవారం ఉగ్రరూపం దాల్చింది. మహారాష్ట్రలో వర్షాలు పడటంతో నది ప్రవాహం కొనసాగుతుండగా దీనికి తోడు దిగువన ఉన్న మేడిగడ్డ ప్రాజెక్టు నీరు బ్యాక్ వాటర్‌గా వచ్చి చేరడంతో ఒక్కసా రిగా ప్రాణహిత వరద ఉధృతమైంది. దీంతో మండ లంలోని వాగులు, వంకల్లోకి నీరు చేరడంతో గంటల వ్యవధిలోనే వందల ఎకరాల పంటలు నీట మునిగాయి. వెంచ పల్లి, సూపాక, జనగామ, ఆల్గామా, పుల్లగామ, సిర్సా, అన్నారం, రాపన్‌పల్లి, అర్జున గుట్ట, లక్ష్మీపూర్, దేవులవాడ గ్రామాల్లో వందల ఎకరాల పంటలు నీట మునిగాయి. ఆది వారం రాత్రి నుంచి వరద ప్రవా హం క్రమక్రమంగా పెరగగా, సోమవారం మధ్యాహ్నం వరకు ఉ ధృతంగా మారి పంటలను నీట ముంచిందని నది తీర గ్రామాల ప్రజలు తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో నదీ తీర ప్రాంతాల ప్రజలు ఆందోళ నకు గురవుతున్నారు. ఇప్పటికే వందల ఎకరాలలోని పత్తి పంటలు నీట మునగగా ఈ ప్రవాహం గంట గంటకు పెరుగుతుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రవాహం ఇలాగే పెరి గితే పుల్లగామ, సిర్సా, శివరాంపల్లె గ్రామాల్లోని కాలనీల లో నీరు చేరే అవకాశముంది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద పూర్తి స్థాయిలో గేట్లను ఎత్తితే దిగువకు నీరు ప్రవహించి ఇక్కడ వరద ఉధృతి తగ్గే అవకాశం ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

ప్రయాణికులకు శుభవార్త.. పట్టాలెక్కనున్న మరో వంద రైళ్లు!

న్యూఢిల్లీ,సెప్టెంబర్1: భారతీయ రైల్వే ప్రయాణికులకు శుభవార్తను చెప్పింది. కరోనా మహమ్మారి కారణంగా పలు రైళ్లను రద్దు చేయగా.. కేంద్రం అన్‌లాక్ 4.0లో పలు మైట్రో సర్వీసులకు సడలింపులు ఇచ్చిన నేపథ్యంలో భారతీయ రైల్వేశాఖ మరో వంద రైళ్లను నడిపేందుకు కసరత్తులు ప్రారంభించింది. అంతర్రాష్ట్ర, ఇంట్రా స్టేట్ సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ప్రస్తుతం ముఖ్యమైన స్టేషన్ల మధ్య 230 రైళ్లు నడుపుతోంది. వీటికి తోడు మరో వంద రైళ్లు నడిపేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కేంద్ర హోంశాఖకు ప్రతిపాదనలు పంపింది. హోంశాఖ అనుమతి కోసం వేచి చూస్తున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాక సర్వీసులను ప్రారంభిస్తామని ప్రకటించింది. రాష్ట్రాల సమన్వయంతో తొలుత ప్యాసింజర్ రైళ్లు నడుపుతామని చెప్పింది. రద్దీ మార్గాలకు మొదట ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పింది.

పట్టణాల్లో సబర్బన్ రైళ్లు నడిపేందుకూ ప్రణాళికను సైతం సిద్ధం చేసినట్లు రైల్వేశాఖ ప్రకటించింది. కరోనా మహమ్మారి కారణంగా మార్చిలో ఇండియన్ రైల్వే రైళ్లను నిలిపివేసింది. సాధారణ మెయిల్, ఎక్స్‌ప్రెస్, సబర్బన్, ప్యాసింజర్ రైలు సర్వీసుల రద్దును చేసింది. పలుసార్లు సర్వీసులను రద్దు చేస్తూ వచ్చింది. మొదట ఆగస్టు 11 వరకు.. అనంతరం సెప్టెంబర్ 30వ తేదీ వరకు అన్ని సర్వీసులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అన్‌లాక్‌లో భాగంగా ముఖ్యమైన స్టేషన్ల మధ్య 230 ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. ప్రస్తుతం అన్‌లాక్‌లో భాగంగా సడలింపులు ఇస్తుండడంతో రైల్వే అధికారులు మరో వంద సర్వీసులను నడిపేందుకు కేంద్ర హోంశాఖకు ప్రతిపాదనలు పంపింది. అనుమతి వచ్చిన వెంటనే సర్వీసులను ప్రారంభించనుంది.

భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

భద్రాద్రి కొత్తగూడెం,,సెప్టెంబర్1: : భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ నుంచి గోదావరికి వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 9 గంటలకు గోదావరి నీటిమట్టం 35.7 అడుగుల వద్ద ఉండగా, మధ్యాహ్నం 3 గంటలకు 37.7 అడుగులకు నీటిమట్టం చేరింది. సాయంత్రం వరకు భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

జనగామలో అత్యాధునిక కరోనా అంబులెన్సులను ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

ఆస్పత్రులకు అత్యాధునిక అంబులెన్సులు

ఉమ్మడి జిల్లాలో పంపిణీ చేసిన మంత్రి ఎర్రబెల్లి
సేవలో ముందుండాలని నేతలకు పిలుపు

జనగామ,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆస్పత్రులకు అంబులెన్సులను మంత్రి ఎర్రబెల్లి అందచేశారు. సేవతోనే జీవితానికి అసలైన పరమార్థం లభిస్తుందని, ప్రజలను కష్టకాలంలో ఆదుకున్న వాళ్లే అసలైన నాయకులని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఓట్లప్పుడే కాకుండా నాయకులు కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఆదుకోవాలన్నారు. ఇప్పటి వరకు తనకు తోచిన విధంగా నిత్యావసర సరుకులు, మాస్కులు, సానిటైజర్లు పంపిణీ చేశామన్నారు. ఇదే తరహాలో ఇప్పుడు తాజాగా ఆక్సిజన్, వెంటిలేటర్లు ఉండే అత్యాధునిక అంబులెన్స్ వాహనాన్ని ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని పాలకుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాలకు ఉపయోగ పడేవిధంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక సదుపాయాల అంబులెన్స్ వాహనాన్ని సంబంధిత వైద్యాధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేటీఆర్ తన పుట్టిన రోజు సందర్భంగా గిఫ్ట్ ఎ స్మైల్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అందులో భాగంగా అంబులెన్స్ లను అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పాలకుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. హాస్పిటల్ ని పరిశీలించారు. హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న పోస్టు ఆపరేషనల్ వార్డులోని మహిళలను పరామర్శించారు. వారికి కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. అలాగే కరోనా బాధితుల కోసం పాలకుర్తి పీఆర్ ఏఈ మహ్మద్ గౌస్ పాషా తన నెల వేతనాన్ని విరాళంగా మంత్రికి అందజేశారు.. పాషా ఔదార్యాన్ని మంత్రి అభినందించారు. అంతకుముందు మహబూబాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కరోనా బాధితులకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా అత్యాధునిక వసతులతో కూడిన అంబులెన్స్ వాహనాన్ని అందిస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తో కలిసి మంత్రి అంబులెన్స్ వాహన తాళం చెవిని తొర్రూరు వైద్యాధికారి డాక్టర్ దిలీప్ కుమమార్ కు అందించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 14 వాహనాలను ఇచ్చినట్లు మంత్రులు తెలిపారు. వీటిలో పాలకుర్తి నియోజకవర్గానికి రెండు వాహనాలను అందజేస్తున్నట్లు వారు తెలిపారు. అంబులెన్స్‌లను ప్రజలకు ఉపయోగపడే విధంగా చూసుకోవాలని సంబంధిత వైద్యాధికారికి మంత్రులు సూచించారు.

జిఎస్టీ చెల్లింపులపై కేంద్రం మెలిక

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయాలు
రాష్ట్రాలకు కోత పెట్టడంపై సర్వత్రా నిరసన

న్యూఢిల్లీ,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): దేశమంతటా ఒకే విధమైన పన్ను విధానం జిఎస్టీ ప్రవేశపెట్టాలని తొందరపెట్టి దానిని అమలు చేయించు కున్న కేంద్రం ఇప్పుడు రాష్ట్రాలకు కోత పెట్టాలని చూడడం దారుణం కాక మరోటి కాదు. కారోనా కారణంగా అనేక రంగాలు దివాళా తీసి రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి కూడా దారుణంగా తయారయ్యింది. అప్పట్లో జిఎస్టీ కారణంగా తమ ఆదాయం పడిపోతుందని అనేక రాష్ట్రాలు గగ్గోలు పెట్టాయి. అయితే ఆ లోటు మేము భర్తీ చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. కరోనా తాకిడి అతలాకుతలం చేసింది.ఆర్థిక వ్యవస్థ కొడిగట్టి పోయింది. ఉత్పత్తి ఉద్యోగాలు వ్యాపారాలు అన్ని దెబ్బతిన్నాయి. రాష్ట్రాల ఆదాయం ఘోరంగా దెబ్బతిన్నది. ఇంత జరుగుతున్నా ఒక్కసారి కూడా ఆర్థిక మంత్రుల సమావేశం జరపకుండా తమ చిత్తానుసారం ప్యాకేజీ ప్రకటించారు. ఇదిలావుంటే జిఎస్టీ పరిహారం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు రూ.3 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంది. పరిహారాన్ని రూ.1.65 లక్షల కోట్లకు పరిమితం చేయడాన్ని తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. జిఎస్టీ పరిహారం విషయంలో కేంద్రం ఇచ్చిన రెండు ఆప్షన్లు రాష్ట్రాలకు నష్టదాయకమే నని ఆర్థిక మంత్రి హరీస్ రావు స్పష్టంచేశారు. ఇదే విషయాన్ని వివరిస్తూ సీఎం కేసీఆర్ సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. కేంద్రానికి ఆప్షన్లు లేవని,100 శాతం చెల్లించాల్సిందేనని చెప్పారు. జిఎస్టీ పరిహారం విషయంలో కేంద్రం వైఖరిపై పశ్చిమబెంగాల్, కేరళ, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల ఆర్థికశాఖ మంత్రులు కూడా వ్యతిరేకిస్తున్నారు. జిఎస్టీ చట్టం ప్రకారం రాష్ట్రాలకు 14శాతం వృద్ధిరేటు ఆధారంగా పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. జిఎస్టీ కౌన్సిల్ 7, 8వ కౌన్సిల్ సమావేశాల్లో అప్పటి ఆర్థికమంత్రి, దివంగత అరుణ్‌జైట్లీ సైతం రాష్ట్రాలు సెస్సు నష్టపోతే కేంద్రమే చెల్లిస్తుందని స్పష్టంగా చెప్పారు. ఈ మేరకు తీర్మానం కూడా ఆమోదించారు. కరోనా వల్ల తెలంగాణ గత నాలుగు నెలల్లో దాదాపు రూ.8వేల కోట్లు ఆదాయం కోల్పోయింది. ఆరోగ్యరంగంలో ప్రజలకు ప్రత్యక్ష బాధ్యత వహించాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలను నామమాత్రం చేసి మోడీ సర్కారు వ్యక్తిగతంగా ప్రధాని లాక్‌డౌన్‌లు అన్‌లాక్‌లు అన్నీ ఆదేశాలు జారీ చేస్తూ వెళ్లారు. రాష్ట్రాలకు చెల్లించాల్సిన మూడు లక్షల కోట్లలోనూ 70 లక్షల కోట్లవరకూ సెస్ ద్వారా వస్తుంది. మిగిలింది 2.35 లక్షల కోట్లు. వాస్తవానికి కరోనాకు ముందే ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగావుంది. రాష్ట్రాలు అప్పుభారంలో కూరుకుపోయాయి. తర్వాత వాటి భారం మరింత పెరిగింది. కేంద్రం ఆదుకోకుండా దైవనిర్ణయం మీ తిప్పలు మీరే పడాలనడం ఏం న్యాయం? అదే కాలంలో ఒక్క పెట్రోలియం మీదనే కేంద్రానికి ప్దదెనిమిది లక్షల కోట్లు మిగిలాయి. ఇందులో రెండున్నర లక్షల కోట్లు లెక్కలోవే కావు. అయిదేళ్ల పాటు లోటు భర్తీ చేస్తామని రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన హామీని కాలరాయాలనుకోవడం సరికాదు. కరోనాను ఎదుర్కొవడానికి కూడా కేంద్రం నుంచి నిర్దిష్ట సాయం అందింది నామమాత్రం. ఇప్పుడు దయ చూపి అప్పులు చేసుకోవడానికి అనుమతిస్తానడం పెద్ద ఆప్షనా? అన్నది ఆశ్చర్యంగా ఉంది. ఈ విషయంలో కేంద్రం రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించి రాష్ట్రాలకు జిఎస్టీ బకాయిలు చెల్లంఇచడం మంచిది.

ప్రణబ్ ముఖర్జీకి నివాళులు అర్పించిన మంత్రులు

వరంగల్ రూరల్ , సెప్టెంబర్1: భారతరత్న ప్రణబ్ ముఖర్జీకి మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ రాష్ట్రపతి, భారతరత్న, మహోన్నత వ్యక్తి స్వర్గీయ ప్రణబ్ ముఖర్జీ నిన్న గుండెపోటుతో సైనిక హాస్పిటల్ లో మరణించారు. నేడు మహబూబాబాద్, తొర్రూర్ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మంత్రులు నివాళులు అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కమిటీకి నాయకత్వం వహించి, రాష్ట్ర సాధన నేత మన ముఖ్యమంత్రి కేసీఆర్ కు మార్గనిర్దేశనం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుపై సంతకం చేసిన రాష్ట్రపతిగా తెలం గాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపో తారన్నారు. ప్రభుత్వం వారం రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించిందని, వీటిని అందరూ పాటించాలని కోరారు.

కరోనా పీడ అప్పుడే విరగడ కాలేదు

-మరింత అప్రమత్తత అవసరం అన్న టెడ్రోస్

జెనీవా,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ నేపథ్యంలో చాలా వరకు స్తంభించిన పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు మళ్లీ గాడిలో పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. ఆర్థిక వ్యవస్థ పునర్ ప్రారంభాన్ని స్వాగతిస్తున్నామని, కానీ కరోనా మహమ్మారి వెళ్లిపోయినట్లు భావించకూడదు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్నది. కరోనా వైరస్ ఆనవాళ్లు బయటపడి 8 నెలల అవుతున్నదని, ప్రజలు చాలా నీరసించి ఉంటారని తాము అర్థం చేసుకోగలమని, కానీ ఏ ఒక్క దేశంలో కూడా మహమ్మారి అంతం అయినట్లు భావించకూడదని డబ్ల్యూహెచ్‌వో చీఫ్ టెడ్రోస్ తెలిపారు. వైరస్ అత్యంత సులువుగా వ్యాప్తి చెందుతున్నదని, ప్రాణాలను కాపాడడంలో, వైరస్‌ను నియంత్రించడంలో మనం అందరం సీరియస్‌గా ఉండాలన్నారు. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు సురక్షితమైన చర్యలు అమలు చేయాలని అన్ని దేశాలను డబ్ల్యూహెచ్‌వో కోరింది. బహిరంగ కూడికలను నియంత్రించాలన్నది. ఎక్కువగా వైరస్ బారినపడే అవకాశం ఉన్న వారిని రక్షించే చర్యలు చేపట్టాలన్నది. వైరస్‌ను ప్రపంచదేశాలు ఎంత నియంత్రిస్తే, ఆయా దేశాలు తమ వ్యాపారాన్ని మొదలుపెట్టవచ్చు అని టెడ్రోస్ పేర్కొన్నారు. ఎటువంటి నియంత్రణ లేకుండా ఆర్థిక వ్యవస్థలను ఓపెన్ చేయడం ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. వైరస్ కాలం గడిచిపోయిందన్న భావనను ఈ దేశం కూడా చేయవద్దు అన్నారు.

చదువు కోసం రోజూ 10కి.మీలు నడిచిన ప్రణబ్

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 1(ఆర్ఎన్ఎ): దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తన చిన్నతనంలో ఎంతో కష్టపడి ఈ స్థాయికి ఎదిగాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజకీయ కుటుంబంలో ప్రణబ్ జన్మించారు. ముఖర్జీ తల్లిదండ్రులు కమదా కింకర్ ముఖర్జీ రాజ్యలక్ష్మి ముఖర్జీ. దాదా తండ్రి కమదా కింకర్ ముఖర్జీ భారత స్వాతంత్ర ఉద్యమంలో చురుకుగా పని చేశారు. 1952 నుంచి 1964 మధ్య కాలంలో వెస్ట్ బెంగాల్ ఎమ్మెల్సీగా సేవలందించారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ తన చిన్నతనంలో ఎంతో కష్టపడ్డారు. బెంగాల్ లోని ఓ మారుమూల గ్రామంలో జన్మించిన ఆయన చిన్నప్పుడు స్కూలు వెళ్లడం కోసం రోజూ 10 కి.మీలు నడిచి వెళ్లేవాడు.

అప్పట్లో మాకు రవాణా సౌకర్యాలు ఉండేవి కావని.. చిన్నతనంలో చదువు కోసం రోజూ 10 కి.మీలు నడిచివెళ్లే వాడిని అని ప్రణబ్ ఓ సందర్భంలో తెలిపారు. ఇక వర్షకాలంలో పరిస్థితి దారుణంగా ఉండేదని ప్రణబ్ గుర్తు చేశారు. బురదలో నడిచే వెళ్లే పరిస్థితి ఉండేది కాదని.. బట్టలన్నీ బురదతో నిండిపోయేవని అన్నారు. ఓ ఇంటర్వ్యూలో తన చిన్ననాటి కష్టాలను ప్రణబ్ వివరించారు. అంత కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నానని ప్రణబ్ వివరించాడు.

మారటోరియం మరో రెండేళ్లు పొడిగింపు?

సుప్రీంకోర్టులో పిటిషన్ పై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదన
మార్చి 2021 వరకు పెంచే యోచనలో కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): రుణాల చెల్లింపునకు సంబంధించి మారటోరియం గడువు పొడిగించాలంటూ దాఖలైన పిటిషన్ పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఎదుట హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. అన్ని లోన్లకు రెరడేళ్ల వరకు మారటోరియం పెంచే యోచనలో ఉన్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన ఆయన ఇప్పటికే ఈ విషయంపై కసరత్తు ప్రారంభమైందని మార్చి 2021 వరకు మారటోరియం కొనసాగిస్తామని వెల్లడించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం... చెల్లించని ఈఎంఐలపై ఎలాంటి అదనపు వడ్డీ గానీ పెనాల్టీ గానీ విధించకూడదని ఆదేశించింది. ఈ కేసును బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.కాగా ఆగస్ట్ 31తో ముగియనున్న మారటోరియం గడువును కరోనా పరిస్థితుల దష్ట్యా డిసెంబర్ 31 వరకు పొడించాలని కోరుతూ న్యాయవాది విశాల్ తివారీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. కరోనా విగ్రహం కారణంగా తలెత్తిన సంక్షోభం కారణంగా.. సాధారణ మధ్య తరగతి ప్రజలు ఉద్యోగుల జీవితాలు తలకిందులయ్యాయని వివిధ అవసరాల కోసం తీసుకున్న లోన్లు చెల్లించే పరిస్థితిలో వారు లేరని న్యాయస్థానం దష్టికి తీసుకువెళ్లారు. మారిటోరియం గడువును ఈ ఏడాది చివరి వరకు పెంచేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆర్బీఐ వివిధ బ్యాంకులను ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్పై న్యాయస్థానం విచారణ చేపట్టగా.. అన్ని రుణాలపై రెరడేళ్ల వరకు మారటోరియం పొడిగిస్తామని కేంద్రం చెప్పడంతో అందరికీ ఉపశమనం లభించినట్లయింది.

కరోనా వ్యాప్తిలో కొత్తపోకడ

రాష్ట్రంలో 31 శాతం మందికే కరోనా లక్షణాలు
69 మందికి లక్షణాలు లేకుండానే పాజిటివ్ !
రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ తాజా నివేదిక!!

హైదరాబాద్,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి ..ఎవరిపై ఎటువైపు నుండి దాడి చేస్తుందో ఎవ్వరం చెప్పలేని పరిస్థితి. అసలు కరోనా సోకిన వ్యక్తిని కూడా గుర్తించడానికి కొన్ని కొన్ని సార్లు కష్టం అవుతుంది. కొందరిలో కరోనా లక్షణాలు త్వరగానే బయటపడితే ..మరికొందరిలో కేవలం కరోనా నిర్ధారణ పరీక్షల్లో మాత్రమే కరోనా ఉన్నట్టు తేలుతుంది. అలాగే రోజుకో లక్షణం వెలుగులోకి వస్తుండటంతో అందరిలో ఆందోళన పెరిగిపోతుంది. ఇక ఈ మహమ్మారిని అరికట్టే వ్యాక్సిన్ కోసం చాలా దేశాల నిపుణులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇకపోతే తెలంగాణలో కూడా రోజురోజుకి కరోనా మరింత పుంజుకుంటుంది అని తెలుస్తుంది. తెలంగాణలో చాలామంది కరోనా వైరస్ లక్షణాలు లేకుండానే కరోనా బారినపడుతున్నారని వెల్లడైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటివరకు వచ్చిన కేసులను పరిగణలోకి తీసుకోని .. మొత్తం కేసుల్లో 69 శాతం మంది లక్షణాలు లేకుండానే కరోనా బారినపడినట్టు తేల్చారు. ఇక 31 శాతం మందికే కరోనా లక్షణాలు బయటపడ్డాయని తేల్చింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 124963 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా అందులో 86225 మందికి లక్షణాల్లేవని వెల్లడించారు. ఇక 38738 మందిలో కరోనా లక్షణాలు కనిపించాయి. ఈ కేసుల కారణంగానే ఇతరులకు పెద్దసంఖ్యలో వైరస్ సోకుతోంది. ఈ కారణంగానే అనేక కుటుంబాల్లో 15 నుంచి 20 మందికి కూడా కరోనా సోకినట్లు అధికారులు చెప్తున్నారు.

కాంటాక్ట్ ట్రేసింగ్లో వైద్య ఆరోగ్యశాఖ ముందంజలో ఉంది. ఆదివారం 37791 శాంపిళ్లను సేకరించగా వాటిలో ప్రాథమిక రెరడో కాంటాక్ట్ ద్వారా అనుమానిత లక్షణాలతో పరీక్ష చేయించుకున్న వారు 59 శాతం మంది ఉన్నారు. మిగిలిన 41 శాతం మంది డైరెక్ట్ బాధితులు. అంటే ఈ బాధితుల ద్వారా ప్రాథమిక

కాంటాక్టు అనుమానంతో 17006 (45) మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ ప్రాథమిక కాంటాక్టుల నుంచి రెరడో కాంటాక్టు అయిన వారిలో 5290 (14) మందికి పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా జిల్లాల్లో ట్రేసింగ్ పక్రియ పకడ్బందీగా సాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాథమిక సెకండరీ కాంటాక్టులను వెంటనే గుర్తించడం వల్ల వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట పడుతోంది అని చెప్తున్నారు. లక్షణాల్లేకుండా ఎక్కువ మంది కరోనా బారినపడటం వారి ద్వారా వైరస్ సోకిన ప్రాథమిక సెకండరీ కాంటాక్టులను పరీక్షల ద్వారా గుర్తించి తక్షణ వైద్యం చేయడం వల్ల చాలామంది కరోనా నుంచి వేగంగా కోలుకుంటున్నారు. వీరిని ఇళ్లలోనే ఉంచుతూ చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట

వినయం వివేకం ప్రణబ్ సొంతం

వివాదాస్పద రాజకీయాలకు ఎప్పుడూ దూరం
ఎప్పటికీ స్ఫూర్తిగా ఆయన రాజకీయ జీవితం

న్యూఢిల్లీ, సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): పదవిలో వుండగానే తన సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని మూడు భాగాలుగా రాసిన ఒకే ఒక రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీ చరిత్రలో నిలుస్తారు. అభిప్రాయాలు నిక్కచ్చిగా చెప్పే ప్రణబ్ దా అందులోనూ తన భావాలు ఏమాత్రం దాచుకోలేదు. తమ నాయకత్వంతో తాను విభేదించిన అంశాలు తనకు వస్తాయనుకున్న అవకాశాలు ఎలా దూరమైనాయనేది కూడా నిర్మొహమాటంగా రాసుకున్న మేధావి ఆయన. రాష్ట్రపతి భవన్‌ను ఆయన ప్రజలకు చేరువ చేశారు. అలాగే ప్రతిపక్షాలకు కూడా భరోసా కలిగించారు. సమస్యలను చెప్పుకునే వేదికగా రాజ్‌భవన్‌ను తీర్చి దిద్దారు. అలా ప్రతిపక్షాల ప్రతినిధి వర్గాలను కుసుకోవ దానికి చాలా అవకాశాలు ఇచ్చారు. రాష్ట్రపతిగా పదవీ కాలం మధ్యలో నరేంద్ర మోడీ ప్రధాని పదవి చేపట్టినా రాజ్యాంగ నిబంధన ప్రకారం సజావుగా సాగేందుకు ప్రాధాన్యత నిచ్చారు. మోడీ కూడా ఆయనతో దగ్గరగా వుండేందుకు ఎంతగానో ప్రయత్నించడం చూశాం. ఎందుకంటే అందరికీ ప్రణబ్ దా అంటే పెద్దాయన అనిపించుకున్నారు. పదవీ కాలం చివరలో స్వగ్రామం సందర్శించి మూలాలు మర్చిపోరాదనే సందేశం ఇచ్చారు. ఆయన కన్నుమూతతో దేశం ఒక సమున్నత రాజనీతివేత్తను పాలనా చతురుడైన వ్యూహకర్తను కోల్పోయింది. గౌరవప్రదంగా క్రియాశీల జీవితం నుంచి సెలవు తీసుకున్న ఒక సమున్నత నేత ప్రస్థానం ఆయనది. ఇక తెలంగాణ ఉద్యమ క్రమంలో ప్రణబ్ కమిటీ నిరంతర ప్రస్తావనగా వుండేది. మీడియాతోనూ ఆయన సూటిగా పొదుపుగా మాట్లాడేవారు. కొన్నిసార్లు కఠినంగానూ వుండేది. ఆరెస్సెస్ వేదికకు ఆహ్వానించినప్పుడు ఏం చెబుతారనే ఆసక్తి నెలకొనగా లౌకికతత్వం అవసరం చెప్పి వచ్చారు. ప్రణబ్‌దా జీవితం పరిశీలిస్తే ఆయన పెద్దగా ప్రజాపునాది వున్న నేతకాదు. ఆ కాలంలో బెంగాల్‌లో సిపిఎం అప్రతిహతంగా పాలిస్తున్న పరిస్థితి. రాజకీయంగా తీవ్రంగా వ్యతిరేకిస్తూనే జ్యోతిబసు వంటివారితో కూడా ఆయన వ్యక్తిగత సంబంధాలు పాటించేవారు. ఇప్పుడు మమతా బెనర్జీ కూడా ఆయన ముందు మోకరిల్లడం చూస్తాం. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్, కెసిఆర్ ఆయనంటే అభిమానం చూపేవారు. 1969లో వి.కె. కృష్ణమీనన్ బంగ్లా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తుంటే, ఆయన వద్ద ప్రచార నిర్వాహకుడిగా ఉన్న ప్రణబ్ ముఖర్జీ కీర్తి ఇందిరాగాంధీ దాకా వెళ్లడంతో రాజకీయంగా టర్నింగ్ అని చెప్పవచ్చు. అలా ప్రణబ్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకుని అనంతరకాలంలో రాజ్యసభ సభ్యుడిని చేశారు. అలా నాలుగేళ్లలోనే ఉప మంత్రిని చేశారు. ఆ పైన మరో పదేళ్లకు ఆర్థికమంత్రిని చేశారు. ఇందిర హత్యకు గురయ్యేనాటికి ఆమె కేబినెట్‌లో సీనియర్ మంత్రిగా ప్రణబ్ ఉన్నారు. నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి చనిపోయినప్పుడు, అప్పటి రాష్ట్రపతి రాధాకృష్ణన్ సీనియర్ మంత్రి అయిన గుల్జారీలాల్ నందాను తాత్కాలిక ప్రధానిగా నియమించారు. ఇందిర చనిపోయినప్పుడు రాష్ట్రపతి జైల్‌సింగ్ కూడా అట్లాగే చేస్తారని ప్రణబ్ ఆశించారు. కానీ నేరుగా రాజీవ్ గాంధీ ప్రధాని అయ్యారు. దీంతో ప్రణబ్ వేరుకుంపటి గా పెట్టాల్సి వచ్చింది. సొంత పార్టీ పెట్టుకున్నారు. మళ్లీ 1989లో కాంగ్రెస్‌లోనే కలసిపోయారు. ప్రణబ్ గురించి ఇందిరకు భయాలేమీ లేవు కానీ, రాజీవ్‌కు, ఆ తరువాత సోనియాకు చాలా భయమే ఉందనడానికి ఆయన ను ప్రధాని చేయకపోవడమే కారణంగా చూడాలి. అలా పి.వి. ప్రధాని అయ్యాకనే మళ్లీ ప్రణబ్‌ను కేబినెట్‌లోకి తీసుకున్నారు. పివి హయాం తరువాత సోనియాను కాంగ్రెస్ అధ్యక్షురాలిని చేయడానికి ప్రణబే పావులు కదిపారు. 2004లో మొదటి యుపిఎ ప్రభుత్వం ఏర్పడినప్పుడు, ప్రణబ్ కాకుండా, మన్మోహన్ సింగ్ ప్రధాని అభ్యర్థి కావడం వెనుక కూడా సోనియాకు భయాలు ఉండివుంటాయి. అందుకే ప్రధాని ఆశను సమూలంగా చిదిమివేయడానికే 2012లో ఆయనను రాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారని అంటారు. రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీ యుపిఎ కంటె ఎన్‌డిఎ ప్రభుత్వంతో ఎక్కువ కాలం వ్యవహరించారు. ఎక్కడా ప్రభుత్వానికి సమస్య లేకుండానే లౌక్యంగా ఆయన వ్యవహారసరళి సాగింది. ఉపరాష్ట్రపతిగా ఉండిన హమీద్ అన్సారీ విషయంలో ఎన్‌డిఎ ప్రభుత్వం బాహాటంగానే వ్యతిరేకత ప్రకటించేది కానీ, ప్రణబ్ అంటే గౌరవ భావనతోనే వ్యవహరించేది. అందుకే ప్రణబ్ పట్ల కృతజ్ఞతాపూర్వకంగా నరేంద్ర మోడీ ఆయనకు భారతరత్నను ప్రకటించారు. అలాగే వాజ్‌పేయ్‌కు ప్రకటించిన భారతరత్నను నేరుగా ప్రణబ్‌ను తీసుకుని వెళ్లి వాజ్‌పేయి÷-÷-కి అందచేయించారు. ప్రణబ్ ముఖర్జీ నాగ్‌పూర్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వేదికపై ప్రసంగించడం వివాదాస్పదం అయింది. ఆ కార్యక్రమానికి వెళ్లవద్దని కాంగ్రెస్ పార్టీతో సహా, అనేక వర్గాలు ఆయనకు విజ్ఞప్తి చేశాయి. అభిప్రాయభేదాలు ఉండవచ్చునని, వాటిని సహించకుండా ద్వేషభావం కలిగి ఉండడం మంచిది కాదని ప్రణబ్ ఆ సందర్భంగా సందేశం ఇచ్చారు. చదువు అనుభవం అందించిన వివేకం ఆయన నడవడిలో ఉండేది. మనిషి పొట్టి అయినా గట్టి వాడనిపించుకున్నాడు.

కరోనా పీడ అప్పుడే విరగడ కాలేదు

మరింత అప్రమత్తత అవసరం అన్న టెడ్రోస్

జెనీవా, సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ నేపథ్యంలో చాలా వరకు స్తంభించిన పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు మళ్లీ గాడిలో పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. ఆర్థిక వ్యవస్థ పునర్ ప్రారంభాన్ని స్వాగతిస్తున్నామని, కానీ కరోనా మహమ్మారి వెళ్లిపోయినట్లు భావించకూడదు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్నది. కరోనా వైరస్ ఆనవాళ్లు బయటపడి 8 నెలల అవుతున్నదని, ప్రజలు చాలా నీరసించి ఉంటారని తాము అర్థం చేసుకోగలమని, కానీ ఏ ఒక్క దేశంలో కూడా మహమ్మారి అంతం అయినట్లు భావించకూడదని డబ్ల్యూహెచ్‌వో చీఫ్ టెడ్రోస్ తెలిపారు. వైరస్ అత్యంత సులువుగా వ్యాప్తి చెందుతున్నదని, ప్రాణాలను కాపాడడంలో, వైరస్‌ను నియంత్రించడంలో మనం అందరం సీరియస్‌గా ఉండాలన్నారు. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు సురక్షితమైన చర్యలు అమలు చేయాలని అన్ని దేశాలను డబ్ల్యూహెచ్‌వో కోరింది. బహిరంగ కూడికలను నియంత్రించాలన్నది. ఎక్కువగా వైరస్ బారినపడే అవకాశం ఉన్న వారిని రక్షించే చర్యలు చేపట్టాలన్నది. వైరస్‌ను ప్రపంచదేశాలు ఎంత నియంత్రిస్తే, ఆయా దేశాలు తమ వ్యాపారాన్ని మొదలుపెటవచ్చు అని టెడ్రోస్ పేర్కొన్నారు. ఎటువంటి నియంత్రణ లేకుండా ఆర్థిక వ్యవస్థలను ఓపెన్ చేయడం ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. వైరస్ కాలం గడిచిపోయిందన్న భావనను ఈ దేశం కూడా చేయవద్దు అన్నారు.

దేశంలో ఒక గొప్ప నేతను కోల్పోయింది

ప్రణబ్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు
కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆది శ్రీనివాస్

వేములవాడ, సెప్టెంబర్ 1 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో అమరవీరుల స్తూపం వద్ద భారత మాజీ

రాష్ట్రపతి భారత రత్నఅవార్డు గ్రహీత స్వర్గీయ ప్రణబ్ ముఖర్జీ కి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం ఆయన తో పాటు పలువురు నాయకులు చిత్రపటానికి పూలమాలలు వేశారు ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశం ఓ గొప్ప రాజనీతిజ్ఞుడిని కోల్పోయింది. ఎంతో శ్రమ, పట్టుదల, క్రమశిక్షణతో దేశ రాజ్యాంగ అత్యున్నత పదవిని చేపట్టారు. ప్రజా సేవలో భాగంగా ఆయన చేపట్టిన అన్ని పదవులకూ వన్నె తెచ్చారు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా తెలంగాణ రాష్ట్రము ఏర్పాటు లో కీలక పాత్ర పోషించిన ప్రణబ్ ముఖర్జీ ని తెలంగాణ ప్రజలు మరిచి పోరు అని అన్నారు

ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్,చిలుక రమేష్,కూరగాయల కొమురయ్య, వకులాభారణం శ్రీనివాస్,నెర్లే శ్రీధర్ గౌడ్,ముడికె చంద్రశేఖర్,నాయిని ప్రభాకర్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్,కనికరపు శ్రీనివాస్,కోయలకార్ మస్తాన్,కొలకని రాజు ఎర్ర శ్రవన్, శశాంక్,శ్రీకాంత్,పోతుగంటి వెంకన్న,తదితరులు పాల్గొన్నారు

జిఎస్టీ చెల్లింపులపై కేంద్రం మెలిక

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయాలు
రాష్ట్రాలకు కోత పెట్టడంపై సర్వత్రా నిరసన

న్యూఢిల్లీ, సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): దేశమంతటా ఒకే విధమైన పన్ను విధానం జిఎస్టీ ప్రవేశపెట్టాలని తొందరపెట్టి దానిని అమలు చేయించు కున్న కేంద్రం ఇప్పుడు రాష్ట్రాలకు కోత పెట్టాలని చూడడం దారుణం కాక మరోటి కాదు. కారోనా కారణంగా అనేక రంగాలు దివాళా తీసి రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి కూడా దారుణంగా తయాంయ్యింది. అప్పట్లో జిఎస్టీ కారణంగా తమ ఆదాయం పడిపోతుందని అనేక రాష్ట్రాలు గగ్గోలు పెట్టాయి. అయితే ఆ లోటు మేము భర్తీ చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవపరిస్తోంది. కరోనా తాకిడి అతలాకుతలం చేసింది. ఆర్థిక వ్యవస్థ కొడిగట్టి పోయింది. ఉత్పత్తి ఉద్యోగాలు వ్యాపారాలు అన్ని దెబ్బతిన్నాయి. రాష్ట్రాల ఆదాయం ఘోరంగా దెబ్బతిన్నది. ఇంత జరుగుతున్నా ఒక్కసారి కూడా ఆర్థిక మంత్రుల సమావేశం జరపకుండా తమ చిత్తానుసారం ప్యాకేజీ ప్రకటించారు. ఇదిలావుంటే జిఎస్టీ పరిహారం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు రూ.3 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంది. పరిహారాన్ని రూ.1.65 లక్షల కోట్లకు పరిమితం చేయడాన్ని తెలం గాణ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. జీఎస్టీ పరి హారం విషయంలో కేంద్రం ఇచ్చిన రెండు ఆప్షన్లు రాష్ట్రాలకు నష్టదాయకమే నని ఆర్థిక మంత్రి హరీస్ రావు స్పష్టంచేశారు. ఇదే విషయాన్ని వివరిస్తూ సీఎం కేసీఆర్ సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారావ ఎన్‌కు లేఖ రాశారు. కేంద్రానికి ఆప్షన్లు లేవని,100 శాతం చెల్లించాల్సిందేనని చెప్పా రు. జీఎస్టీ పరిహారం విషయంలో కేంద్రం వైఖరిపై పశ్చిమబెంగాల్, కేరళ, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల ఆర్థికశాఖ మంత్రులు కూడా వ్యతిరేకిస్తున్నారు. జీఎస్టీ చట్టం ప్రకారం రాష్ట్రాలకు 14శాతం వృద్ధి రేటు ఆధారంగా పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ కౌన్సిల్ 7, 8వ కౌన్సిల్ సమావేశాల్లో అప్పటి ఆర్థికమంత్రి, దివంగత అరుణ్‌జైట్లీ సైతం రాష్ట్రాలు సెస్సు నష్టపోతే కేంద్రమే చెల్లిస్తుందని స్పష్టంగా చెప్పారు. ఈ మేరకు తీర్మానం కూడా ఆమోదించారు. కరోనా వల్ల తెలంగాణ గత నాలుగు నెలల్లో దాదాపు రూ.8వేల కోట్లు ఆదాయం కోల్పోయింది. ఆరోగ్యరం గంలో ప్రజలకు ప్రత్యక్ష బాధ్యత వహించాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలను నామమాత్రం చేసి మోడీ సర్కారు వ్యక్తిగతంగా ప్రధాని లాక్‌డౌన్‌లు అన్‌లాక్‌లు అన్నీ ఆదేశాలు జారీ చేస్తూ వెళ్లారు. రాష్ట్రాలకు చెల్లించాల్సిన మూడు లక్షల కోట్లలోనూ 70 లక్షల కోట్లవరకూ సెస్ ద్వారా వస్తుంది. మిగిలింది 2.35 లక్షల కోట్లు. వాస్తవానికి కరోనాకు ముందే ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం గావుంది. రాష్ట్రాలు అప్పుభారంలో కూరు కుపోయాయి. తర్వాత వాటి భారం మరిం త పెరిగింది. కేంద్రం ఆదుకోకుండా దైవని ర్ణయం మీ తిప్పలు మీరే పడాల నడం ఏం న్యాయం? అదే కాలంలో ఒక్క పెట్రోలి యం మీదనే కేంద్రానికి ప్దదెనిమిది లక్షల కోట్లు మిగిలాయి. ఇందులో రెండున్నర లక్షల కోట్లు లెక్కలోవే కావు. అయిదేళ్ల పాటు లోటు భర్తీ చేస్తామని రాజ్యాంగబ ద్ధంగా ఇచ్చిన హామీని కాలరా యాలను కోవడం సరికాదు. కరోనాను ఎదుర్కొవ డానికి కూడా కేంద్రం నుంచి నిర్దిష్ట సాయం అందింది నామమాత్రం. ఇప్పుడు దయ చూపి అప్పులు చేసుకోవడానికి అనుమతిస్తానడం పెద్ద ఆప్షనా? అన్న ది ఆశ్చర్యంగా ఉంది. ఈ విషయంలో కేంద్రం రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించి రాష్ట్రాలకు జిఎస్టీ బకాయిలు చెల్లంఇచడం మంచిది.

జేఎన్‌టీయూ బీటెక్, బీఫార్మా, ఎంబీఏ పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్1: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్(జేఎన్‌టీయూ-హెచ్) బీటెక్, బీ ఫార్మా, ఎంబీఏ ఫైనల్ ఇయర్ సెకండ్ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. సెప్టెంబర్ 16వ తేదీ నుండి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 16, 18, 21, 23, 25 తేదీలలో బీటెక్, బీఫార్మా ఫోర్త్ ఇయర్ సెకండ్ సెమిస్టర్ పరీక్షలు అదేవిధంగా ఎంబీఏ సెకండ్ ఇయర్ సెకండ్ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ జరగనున్నట్లు జేఎన్‌టీయూ-హెచ్ వెల్లడించింది. బీటెక్, బీఫార్మా, ఎంబీఏ కోర్సుల్లోని పలు విభాగాలకు సంబంధించిన సెకండ్ ఇయర్ సెకండ్ సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. బీటెక్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఐటీ విభాగాలకు మధ్యాహ్నం 2.30 గంటల నుండి 4.30 గంటల వరకు పరీక్ష నిర్వహణ. ముందే నిర్ణయించినట్లు పరీక్ష వ్యవధిని మూడు గంటల నుండి రెండు గంటలకు తగ్గించారు. ఈ మేరకు ప్రశ్నపత్రాన్ని ఎనిమిది ప్రశ్నలకు గాను ఐదుగా మార్చి పార్ట్-ఎను తొలగించారు.

ప్రయోగ ఫలితానికి దగ్గర్లో కరోనా వ్యాక్సిన్

-యూకే పత్రిక ఆసక్తికర కథనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాక్సిన్ ప్రయోగానికి సంబంధించి ఫలితానికి బ్రిటన్ చాలా దగ్గర్లో వారు వచ్చినట్లుగా కరోనా వ్యాక్సిన్ పై కొత్త కథనాన్ని ఓ పత్రిక ప్రచురించింది. ఆ కథనం ప్రకారం. ప్రపంచ వ్యాప్తంగా కరోనాపై నూట పదికి పైగా ప్రయోగాలు సాగుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రయోగాల్లో అందరి చూపులు కొన్ని సంస్థల పైనే ఉన్నాయి. అలాంటి సంస్థల్లో ఒకటి ఆక్స్ ఫర్డ్ వర్సిటీకి చెందిన ఇంపీరియల్ కాలేజీ శాస్త్రవేత్తలు వ్యాక్సిన్ తయారీపై సానుకూల అంచనాలు ఉన్నాయి.

తాజాగా వారు వ్యాక్సిన్ కనిపెట్టే అంశానికి సంబంధించి చాలా దగ్గరగా వచ్చారని చెబుతున్నారు. మరో ఆరు వారాల్లో వ్యాక్సిన్ తయారీలో సక్సెస్ కావటం ఖాయమంటున్నారు. ఈ వ్యాక్సిన్ రావటంతో ప్రపంచంలో అనూహ్యమైన మార్పులకు తెర తీయనున్నట్లు చెబుతున్నారు. ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కరోనా వైరస్ కు చెక్ పెట్టే సామర్థ్యం ఈ వ్యాక్సిన్ కు ఉందంటున్నారు. ఓపక్క వ్యాక్సిన్ వచ్చేస్తుందన్న మాట వినిపిస్తుంటే.. మరోవైపు కరోనా రెరడోసారి విరుచుకుపడే ప్రమాదం పొంచి ఉందన్న మాట వినిపిస్తోంది. మరికొద్ది రోజుల్లో శీతాకాలం రానున్న వేళ.. వ్యాక్సిన్ కానీ రాకుంటే.. తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటాయని చెబుతున్నారు. రెరడోసారి కరోనా విరుచుకుపడితే.. దాని తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని.. అదే జరిగితే జరిగే నష్టం అపారంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.మరి.. యూకే మీడియా సంస్థ పేర్కొన్నట్లుగా ఆరు వారాలు వ్యాక్సిన్ వస్తుందో రాదో తేలాలంటే.. అప్పటివరకు వెయిట్ చేయటం తప్పించి మరో మార్గం లేదనే చెప్పాలి.

సేవలకు గుర్తింపు...!!

- హెచ్.డి.ఎఫ్.సి నైబరు హుడ్
హీరోలు గా టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు, డైరెక్టర్

వేములవాడ, సెప్టెంబర్ 1 (నేటినిజం ప్రతినిధి):కరోనా మహమ్మారి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న సమయంలో టి ఆర్ కె ట్రస్టు తరఫున ప్రజలకు సేవలందించినందుకు గాను వేములవాడ హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు ఆ సేవలను గుర్తించి నైబర్ హుడ్ హీరోగా టిఆర్ కెట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్, ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ మాట్లాడుతూ ఆపత్కాలంలో ప్రజలకు నిత్యావసర సరుకులను టి ఆర్ కే ట్రస్టు తరఫున సహాయం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇలాంటి సేవలు మరెన్నో ప్రజలకు అందిస్తామని తెలియజేస్తున్నాను. మా సేవలను గుర్తించి హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు వారు అవార్డు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఈ అవార్డు అందించిన బ్యాంకు మేనేజర్ కమలాకర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

హెచ్.డి.ఎఫ్.సి నైబరు హుడ్

హీరో అవార్డు గ్రహీత కుమ్మరి శంకర్

వేములవాడ, సెప్టెంబర్ 1 (నేటినిజం ప్రతినిధి):అవార్డు లాక్ డౌన్ సమయంలో వేములవాడ పట్టణంలో ని నిరుపేదలకు , నిరాశ్రయులకు వృద్ధులకు , చిన్నారులకు ఉంచిన సామాజిక సేవలకు గాను రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి దళిత మోర్చా అధ్యక్షులు కుమ్మరి శంకర్ ను హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపి నైబర్ హుడ్ హీరో అవార్డుకు ఎంపిక చేసింది . మంగళవారం వేములవాడ హెచ్ డి ఎఫ్ సి బ్రాంచ్ బ్యాంకు మేనేజర్ కమల్ ఈ అవార్డును కుమ్మరి శంకర్ నివాసానికి వెళ్లి ఆయనకు అందజేశారు . ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కుమార్ శంకర్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ అవార్డు ఇచ్చి అభినందించిన అందుకు బ్యాంక్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు

అంగన్‌వాడీ కేంద్రాల పెరట్లలో కూరగాయల సాగును చేపట్టాలి : అనితా రాంచంద్రన్

హైదరాబాద్ : అంగన్‌వాడీ కేంద్రాల పెరట్లలో కూరగాయల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితా రాంచంద్రన్ అన్నారు. మంగళవారం యాదగిరిగుట్టలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక్ మహోత్సవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీలకు, పిల్లలకు అవసరమైన పోషక ఆహార పదార్థాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రీ-స్కూల్ విద్యను విస్తరించడంతో పాటు గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు బహుళ సేవా కేంద్రాలుగా పనిచేస్తున్నాయన్నారు. చిన్నారుల, గర్భిణీల బరువు కొలిచేందుకు ప్రతీ కేంద్రంలో తూకపు మిషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోషక మహోత్సవ్‌లో విద్యార్థులందరినీ కవర్ చేయాలన్న కలెక్టర్ ప్రతీ రోజు ఐదుగురు విద్యార్థుల బరువును రికార్డు చేయాలన్నారు. ఆరోగ్య సంరక్షణలో పోషకాహార ప్రాముఖ్యత గురించి అంగన్‌వాడీ సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి మున్సిపల్ చైర్మన్ సుధా మహేందర్, జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ అధికారి జ్యోత్స్న, జిల్లా పిల్లల సంరక్షణ అధికారి సైదులు, తహసీల్దార్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నియోజకవర్గానికో నైపుణ్య కళాశాల

రాష్ట్రంలో మొత్తం 30 కళాశాలల నిర్మాణం
స్థలాల గుర్తింపు ప్రక్రియ చేపట్టాలి
అధికారులతో సమీక్షలో సిఎం జగన్ ఆదేశాలు

అమరావతి, సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): నైపుణ్యాభివృద్ధి కాలేజీల నిర్మాణం కోసం స్థలాల గుర్తింపు పక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భవనాల నిర్మాణం అత్యంత నాణ్యంగా ఉండాలని, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులనకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక నైపుణ్యాభివృద్ధి కళాశాల ఉండేలా మొత్తం రాష్ట్రంలో 30 కశాశాలల నిర్మాణం దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైపుణ్యాభివృద్ధి కళాశాలల ఏర్పాటు, తీసుకుంటున్న జాగ్రత్తలపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట్లాడుతూ.. ఉత్తమ మానవ వనరులను పరిశ్రమలకు అందించడంలో, పారిశ్రామికాభివృద్ధిలో ఈ కాలేజీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీల్లో కోర్సులు, పాఠ్యప్రణాళిక తయారీపై సీఎం ఆరాతీశారు. కాలేజీల కోసం ఇప్పటివరకు దాదాపు 20 చోట్ల స్థలాల గుర్తించినట్లు సీఎం జగన్‌కు అధికారులు వెల్లడించారు. మిగిలిన చోట్ల కూడా చురుగ్గా స్థలాల ఎంపిక పక్రియ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ వివిధ రకాల కోర్సులకు సంబంధించిన పాఠ్యప్రణాళికను సిద్ధంచేశామని పేర్కొన్నారు. ఫినిషింగ్ స్కిల్‌కోర్సులు, ప్రత్యామ్నాయ ఉపాధి కోర్సులు.. ఇలా రెండు రకాలుగా స్కిల్ కాలేజీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొత్తం 162కి పైగా కోర్సుల ద్వారా ఈ కాలేజీల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు, ఇందులో 127 కోర్సులు ఫినిషింగ్ స్కిల్స్, 35 ప్రత్యామ్నాయ ఉపాధి కోర్సులు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. పరిశ్రమల అవసరాలపై సర్వే చేసి దాని ప్రకారం కోర్సులను నిర్ణయించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అధికారులు తెలిపారు. పాఠ్యప్రణాళిక తయారీలో 4 అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యం తీసుకున్నామని, సింగపూర్ పాలిటెక్నిక్, జీఐజెడ్, వాన్ హాల్ లారెన్‌స్టైన్ (యూనివర్శిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్), డిపార్ట్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ భాగస్వామ్యాన్ని తీసుకున్నామని తెలిపారు. అలాగే మరో 23 ప్రఖ్యాత సంస్థల భాగస్వామ్యం, వారితో ఎంఓయూలకు సిద్ధమయ్యామని, మరో 35 సంస్థలతో చర్చలు నడుస్తున్నాయని అధికారులు వివరించారు. ల్యాబ్ ఏర్పాట్లు, పాఠ్యప్రణాళికలో వీరి సహకారం తీసుకుంటున్నామన్నారు. ఎంఓయూలకు సిద్ధమైన వాటిలో డెల్, హెచ్‌పీ, టీసీఎస్, ఐబీఎం, బియోకాన్, టాటా తదితర కంపెనీలు ఉన్నాయన్నారు. అలాగే వ్యవసాయంలో ఉపయోగించే యంత్రాల వినియోగం, వాటి మరమ్మతులపైనా శిక్షణ ఇవ్వాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఆర్థికశాఖ అధికారులతో కూర్చుని నిర్మాణానికి ప్రణాళిక సిద్ధంచేసుకుని పనులు త్వరగా మొదలుపెట్టాలని సూచించారు. హైఎండ్‌స్కిల్స్‌తోపాటు ప్రతి కాలేజీలో కూడా ఏసీలు, ప్లంబింగ్, భవన నిర్మాణం తదితర పనులపైన యువతకు శిక్షణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి సహా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.అనంతరాము, స్పెషల్ సెక్రటరీ, మేనేజింగ్ డైరెక్టర్ అర్జా శ్రీకాంత్, ఏపీఎస్ఎస్‌డీసీ ఛైర్మన్ చల్లా మధుసూదన్ రెడ్డి ఇతర అధికారులు హాజరయ్యారు.


కిన్నెర ఆర్ట్ థియేటర్స్
కిన్నెర ఆర్ట్ థియేటర్స్,
నేటినిజం
తెలుగు దినపత్రిక,
మరియు
పి.వి.మనోహరరావు గారి
సౌజన్యంతో
భారత పూర్వ ప్రధాని పి.వి.నరసింహారావు గారి
శత జయంతి సందర్భంగా
తెలంగాణ తేజోమూర్తి ★ భారతీయ భవిష్యత్తు
పూర్వ ప్రధాని శ్రీ. పి. వి. నరసింహారావు
శత జయంత్యుత్సవాలు
28.06.2020 - 28.06.2021
పి.వి.నర